
అనధికార చిట్స్

» భారీగా డిపాజిట్ల సేకరణ.. ఆపై ఉడాయింపు
» బలవుతున్న అమాయకులు 7







పోలవరం పురోగతిలో ముందడుగు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ముందడుగు పడింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పోలవరంపై ప్రత్యేక దృష్టి సారించారు. వరుస సమీక్షలు నిర్వహించడం, పనుల పురోగతిపై కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లడంలో సఫలమయ్యారు. ప్రాజెక్టులో అతి కీలమైన డయా ఫ్రం వాల్ నూతన నిర్మాణ పనులను చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ట్రెంచ్ కట్టర్ యంత్రాన్ని స్విచ్ఛాన్ చేసి ప్రారంభించారు. వర్షాల సీజనులో సైతం డి వాటరింగ్ చేస్తూ ఈ పనులను నిర్విఘ్నంగా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



పనుల ప్రారంభానికి అధికారుల పూజలు

» నూతన డయా ఫ్రం వాల్ పనులు ప్రారంభం
» వర్షాల సీజనులో సైతం పనులు చేసేలా ప్రణాళిక
» ఈ నెలాఖరుకు రెండో ట్రెంచ్ కట్టర్ పనులు

- మెయిన్‌లో..



రెండు ఫోన్లు.. నాలుగు సిమ్‌లు

మొన్నటి వరకు ఇంటికి ఒక ల్యాండ్ ఫోన్ ఉండేది. ఖర్చు నెలకు రెండు, మూడు వందల య్యేది. ఇప్పుడు ఆ ఫోన్ మాయ మై సెల్‌ఫోన్ వచ్చింది. ఇంటిలో ఒక్కొక్కరూ ఒకటి నుంచి రెండు ఫోన్‌లు, రెండు నుంచి నాలుగు సిమ్‌లు వాడుతు న్నారు. కుటుంబానికి నెలకు వెయ్యి నుంచి రెండు వేలు ఖర్చు అవుతోంది. 6లో..



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పార్థసారథి,తదితరులు

తెలుగుతనానికి ప్రతిరూపం ఎన్టీఆర్

మంత్రి కొలుసు పార్థ సారథి ఘన నివాళులు

నూజివీడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుతనానికి ప్రతిరూపం ఎన్టీఆర్ అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి అన్నారు. నూజివీడులోని క్యాంప్ కార్యాలయంలో శనివారం మాజీ ముఖ్య మంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అనేది ఒక పేరుకాదని, ఒక ప్రభంజనమ న్నారు. సామాజిక న్యాయం, ప్రజా సంక్షే మం అనే సిద్ధాంతాలపై తెలుగుదేశంపార్టీ నిర్మితమైందన్నారు. రక్తదానం చేసిన కార్యకర్తలను అభినందించారు.



స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో రోడ్డు శుభ్రం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్మన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే చంటి, కమిషనర్ భానుప్రతాప్

ఉత్సాహంగా స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్

ఏలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని పాతబస్టాండు వద్ద ఉత్సాహ పూరిత వాతావరణంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ శనివారం ప్రారంభమైంది. కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆధ్వ ర్యంలో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్వ చ్ఛంద సంస్థలు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని రోడ్లను శుభ్రం చేశారు. బస్టాండ్ ప్రాంగణంలో మొక్కలు నాటి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞను నిర్వహించారు. కలెక్టర్, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కమిషనర్ భాను ప్రతాప్, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో అనురాధ, డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, డీఎస్‌వో రాజు, తదితరులు పాల్గొ న్నారు.

జలవనరుల శాఖ ఎస్ఈ నాగార్జునరావు బాధ్యతల స్వీకరణ

ఏలూరు/ఏలూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సర్కిల్ జలవనరుల శాఖ సూప రింటెండెంట్ ఇంజనీర్‌గా పి.నాగార్జునరావును ప్రభుత్వం నియమించగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. నిడదవోలు శెట్టిపేటలో గోదావరి వెస్ట్రన్ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో భీమవరం డ్రెయినేజీ డివిజన్ ఈఈగా పనిచేశారు. జిల్లాపై పట్టు ఉన్న అధికారిని



ఎస్ఈగా నియమించడంతో ఇక అభివృద్ధి పనులు వేగం పుంజుకోనున్నాయి. కాగా ఎస్ఈగా నియమితులైన నాగా ర్జునరావుకు రాష్ట్ర ఇరిగేషన్ ఎన్జీవో అధ్య క్షుడు చోడగిరి శ్రీనివాసరావు, ఆశాఖ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సొంతింటి కల నెరవేరేలా..!



పేదలకు పట్టణాల్లో రెండు, పల్లెల్లో మూడు సెంట్లు

పేదోళ్ల కల పండింది. ఇన్నాళ్లు అరకొరగా ఇచ్చే ఇళ్ల స్థలాలు కాస్తా కూటమి ప్రభుత్వం ముందుగా ఇచ్చిన హామీ మేరకు భారీగా పెంచింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అతి తక్కువ విస్తీర్ణంలో ఇంతకు ముందు జగన్ ప్రభుత్వం ఎడాపెడా అందరికీ పట్టాలు ఇచ్చింది. కాని, అత్యధిక స్థలాల్లో ఇల్లు కట్టుకునే పరిస్థితి లేకుం డా పోయింది. కూటమి ప్రభుత్వం పేదల పక్షాన నిలిచి ఇకముందు పల్లె ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున పేదలకు పట్టాల రూపంలో ఇవ్వాలని నిర్ణయించింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

గత ప్రభుత్వంలో అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ళు అంటూ జగన్ సర్కార్ హడావుడి చేసింది. నివాస యోగ్యంకాని భూములను ప్రభుత్వమే కొని అక్కడ జగనన్న కాల ల పేరిట లేఅవుట్‌లు వేసింది. జిల్లా వ్యాప్తంగా తొలుత 761 లేఅవుట్‌లను వేయాలని సంకల్పిం చినా అప్పటి ప్రభుత్వానికి చివరకు ధైర్యం చిక్క లేదు. తమ పార్టీ అనుకూలురు నుంచి కొంత, కొందరిని ఒప్పించి మరికొంత భూమిని సేకరిం చి దాదాపు 491 లేఅవుట్‌లను వేయగలిగారు. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాం తాల్లో సెంటున్నర భూమి ఇచ్చారు. ఇది

» చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం
» హర్షం వ్యక్తం చేస్తున్న పేద వర్గాలు
» వైసీపీ హయాంలో అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లు
» పట్టణ లబ్ధిదారులకు గ్రామాల్లో సెంటుతో సరి.. అనువుగా లేని స్థలాలు
» ముందుకు సాగని నిర్మాణాలు
» క్రమబద్ధీకరణలోను కొత్త ఆశలు

చాలదు మొర్రో అని అప్పట్లో పేద వర్గాలు లబో దిబోమన్నా సర్కారు కుదరదన్నట్టుగా వ్యవహ రించింది. ఫలితంగా అప్పట్లో వేసిన లేఅవుట్ ల్లోనే సగానికి సగం ఇళ్లు నిర్మించుకోవడానికి నిస్సహాయత వ్యక్తం చేశారు. ఏలూరు నగరం లో వేసిన లేఅవుట్‌లలో లక్ష్మీపురం, పోణంగి వంటి లేఅవుట్‌లలో జనం పట్టాలైతే తీసుకున్నా రే గాని ఇల్లు నిర్మించాల్సి వచ్చేసరికి వెనుకడు గు వేశారు. కైకలూరులో నిర్మించతలపెట్టిన జగనన్న కాలనీ రాష్ట్రానికే మోడల్‌గా నిలవాలని భావించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. భారీ వర్షాల కు ఈ కాలనీ కాస్తా ముంపు బారిన పడింది. ముందుచూపు లేకపోవడం ఒక ఎత్తయితే, లబ్ధిదారులకు కొత్త ఆశలు కల్పించడం ఆనాటి ప్రభుత్వం చేసిన అతి పెద్ద తప్పు.

ఇప్పుడేం చేయబోతున్నారంటే..

తాజాగా మంత్రివర్గ సమావేశంలో కూటమి ప్రభుత్వం పేదల కల సాక్షాత్కరించేలా సరికొత్త నిర్ణయాలు తీసుకున్నారు. అప్పటి ప్రభుత్వ హయాంలో వేసిన లేఅవుట్‌లలో ఎవరైనా ఇల్లు నిర్మించుకోకపోతే అటువంటి వారి పట్టాలు రద్దు చేసి కొత్త పట్టాలు ఇవ్వాలని తాజాగా నిర్ణ యించారు. జగన్ ప్రభుత్వ హయాంలో కేవలం కొంతమంది లబ్ధి చేకూర్చే విధంగా వారి నుంచి భూమిని కొనుగోలు చేసి హడావుడిగా లేఅవుట్ లు వేశారు. దీనికితోడు లేఅవుట్‌లు వేసిన స్థలాల యజమానులు కొంతమంది న్యాయ స్థానంను ఆశ్రయించారు. దీంతో ఆ పట్టాల వ్యవహారం కాస్తా అయోమయంలో పడింది. ఇప్పుడు తాజాగా ఆయా లేఅవుట్‌లలో ఉన్న వారికి కొత్తగా పట్టాలు ఇచ్చేందుకు ప్రాథమిక నిర్ణయం తీసుకున్నారు. ఈ లెక్కన దాదాపు జిల్లాలో వేలసంఖ్యలో లబ్ధిదారులు తేలే అవకా శం ఉంది. ఇప్పుడు పేదవారి కల నెరవేర్చేలా ఇంటి స్థలం పెంచిన విస్తీర్ణంతో పట్టా ఇవ్వడా నికి రాష్ట్ర ప్రభుత్వం ఇకముందు ఎలాంటి చర్య లు తీసుకోబోతుందనేదే ఉత్కంఠ రేపుతోంది. ఇదే సందర్భంలో ఎక్కువ స్థలంలో ఇళ్ల నిర్మా ణం చేయడం కూడా పేద వర్గాలకు కాస్తంత బరువేనని మరికొంత మంది వ్యాఖ్యలు చేస్తు న్నారు. ఐదు ఎకరాలు మెట్ట, రెండున్నర ఎకరా లు మాగాణి భూమి కలిగిన వారు కూడా పట్టా పొందేందుకు ఇప్పటికీ అర్హులే.

మరికొన్ని వరాలు..

ఇళ్లు నిర్మించుకోవడానికి అర్హులుగా విస్తీర్ణం పెంచాలని తీసుకున్న నిర్ణయంతోపాటు ఇంతకు ముందే వివిధ రకాల భూముల్లో నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం మరో నిర్ణ యం తీసుకుంది. 2019 నవంబరుకు ముందు ఎవరైనా ఆక్రమిత భూముల్లో నిర్మాణం సాగిం చి ఉంటే ఆ భూమిని కాస్త ఇప్పుడు క్రమబద్ధీక రించబోతున్నారు. ఈ తరహా ఇళ్లు పట్టణ ప్రాం తాల్లో వందల సంఖ్యలో ఉన్నాయి. గత ప్రభు త్వంలోను స్థలాలు క్రమబద్ధీకరిస్తామంటూ ఊరించినా ఆపై జగన్ ప్రభుత్వం చేతులెత్తే సింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం క్రమబద్ధీక రణ దిశగా తీసుకున్న కీలక నిర్ణయం ఆశలు రేపుతుంది. 22ఏ పరిధిలో ఉన్న నిషేధ భూము ల విషయంలోను అటోఇటో తేల్చాలని ప్రభు త్వం భావిస్తుండగా ఆయా భూముల్లో అభ్యంత రాలు లేకపోతే పేదలపరం చేయాలనే నిర్ణయం కొంతలో కొంత ఊరట కలిగిస్తోంది.

సాహసోపేత నిర్ణయం



పట్టణ, గ్రామీణ ప్రాం తాల్లో పేదలు ఇల్లు నిర్మిం చడానికి వీలుగా సంతృప్తి కర విస్తీర్ణంలో ఇళ్ల పట్టా లు ఇవ్వాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం సాహసోపేతం. ఇది వేలాది మంది పేదలకు అతిపెద్ద వరం. ఇప్పటిరవకు చాలీ చాలని స్థలాల్లోనే ఇల్లు నిర్మించుకోవడానికి పేదలు వెనుకంజవేసే వారు. ఎన్నికలకు ముందు ఏదైతే హామీ ఇచ్చిందో ఆ హామీని నెరవేర్చుకుంటున్నారు. కూటమి పక్షాన పేద వర్గాలకు ఈ విషయంలో విస్తృత అవగాహన కల్పించేం దుకు కూటమి భాగస్వామ్యం పక్షాల్లో అందరూ ముందుకు కదలాలి.

- గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

పేదలకు వరం..



గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. అప్పట్లో అంతా గందరగోళ మే. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు సరైన నిర్ణయం తీసుకున్నారు. పేదలను దృష్టిలో పెట్టుకుని పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇస్తున్నట్టు ప్రకటించడం అభినందనీయం. మంచి ఇల్లు నిర్మించుకోవ డమే కాకుండా అలాంటి ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని ప్రకటించడం పేదలకు వరమే. పేదల పక్షపాతిగా అన్నట్టుగా కూటమి నిరూపించుకుంది.

- కొట్టే సుబ్బారావు, మాదేపల్లి



భూ లెక్కలపై కుస్తీ!

» రేపటి నుంచి జిల్లాలో భూముల రీ సర్వే
» 24 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు అమలు
» తొలుత ప్రభుత్వ భూములు.. ఆపై రైతులకు సర్వే

ఏలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం రేపిన భూముల సర్వే చిచ్చు మంటలను ఆర్పేందుకు కూటమి ప్రభుత్వం భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ రకాల సర్వే రాళ్లతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొన్నిచోట్ల అక్రమాలు చోటు చేసుకున్నాయి. రైతుల విజ్ఞప్తులను, ఆవేదనను పట్టించుకో లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 24 మండలాల్లో 24 గ్రామాల్లోని 24,606 ఎకరాల భూముల సర్వేను ఈనెల 20 నుంచి చేపట్టాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జేసీ ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, సర్వే ల్యాండ్ రికార్డ్సు ఏడీ ఎస్‌కే ఎండీ అన్సారీలు తహ సీల్దార్లకు, వీఆర్వో, సర్వేయర్లు, ఇతర సిబ్బంది రెండు విడతలుగా శిక్షణలు పూర్తి చేశా రు. ఇక టీమ్‌లుగా వారు గ్రామాల్లో పకడ్బందీగా అత్యా. దునిక పరికరాలతో సర్వేకు దిగనున్నారు. తహసీల్దార్ల పర్యవేక్షణలో విలేజ్ సర్వేయ ర్లు, వీఆర్వో, మండల సర్వేయర్, ప్రతి మండ లానికి ప్రత్యేకంగా నియమితులైన రీసర్వే డీటీలు తొలుత ప్రభుత్వ భూములను ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మ్యాప్)ల్లో పరిశీలన చేస్తారు. అనంతరం రైతుల సర్వే నెంబర్ల వారీగా రీ సర్వేను వారి సమక్షంలోనే చేస్తారు. తేడాలు, ఇతర ఇబ్బం దులను తొలగించి వాస్తవ రికార్డులకు శ్రీకారం చుడతారు.

సర్వే చేసే గ్రామాలు.. విస్తీర్ణం

జంగారెడ్డిగూడెం మండలంలో ఐ.పోలవరం 2476.55 ఎకరా లు, పోలవరంలో సరిపల్లికుంట 64.99 ఎకరాలు, బుట్టాయ గూడెంలో రాజానగరం 405.60, జీలుగుమిల్లిలో వంకావారిగూడెం 504.21, కామవరపుకోటలో పోలాసిగూడెం 373.81, టి.నరసా పురంలో కృష్ణారావుపాలెం 504.19, ద్వారకా తిరుమలలో నార్త్ కొమ్మర 1471.58, ఏలూరు రూరల్‌లో మాదేపల్లి 1507.98, దెందులూరులో మలకచర్ల 883.83, పెదవేగిలో కవ్వగుంట 1151.71 పెదపాడులో అమృత లింగంపేట 448.72, ఉంగుటూరులో చేబ్రోలు కండ్రిక 536.40, భీమడోలులో సూరప్పగూడెంలో 2382.87, నిడమర్రులో పెదరామ చంద్రపురం 135.44 , కైకలూరులో సోమేశ్వరం 840.60, మండవల్లిలో పులపర్రు 1318.01, కలిదిండిలో వెంకటా పురం 1112.39, నూజివీడులో హను మంతగూడెం 595.22, ఆగిరిపల్లిలో నర్సింగపాలెం 810.06 చాట్రాయిలో చిన్నమ్మపేట 1632.22, ముసు నూరులో అక్కిరెడ్డిగూడెం 2923.78, చింతలపూడి లో ఆముదాలచలక 1757.19, లింగపాలెం మండలం గణపవారిగూడెం 274.00 ఎకరాల్లో భూములను గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా రీసర్వే చేయనున్నారు.



"జిల్లా భూముల రీసర్వేకు రెవెన్యూ, ల్యాండ్ సర్వేశాఖల సంయుక్తంగా సమన్వ యంతో పనిచేయాలని జేసీ ఆదేశాలిచ్చారు. దానికి అనుగుణంగా గ్రామాల్లో సర్వే చేయనున్నాం."

-విశ్వేశ్వరరావు,డీఆర్వో

జిల్లాలో పరిశ్రమల సంఖ్యను పెంచాలి

పారిశ్రామిక సమ్మిట్-25లో కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : 'జిల్లాలో పారిశ్రామిక ప్రగతిలో 20 శాతం ఉన్న వృద్ధిరేటును జిల్లా యంత్రాంగమంతా సమష్టిగా కృషి చేసి 200 శాతానికి పెంచుతాం. దీనికి సహాయ సహకారాలు అందించి పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారి శ్రామిక వేత్తలు ముందుకు రావాలి' అంటూ కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం పారి శ్రామిక సమ్మిట్-2025తో పాటు పారిశ్రామిక ప్రోత్సాహకాల కమిటీల సమావేశం నిర్వహించారు. ప్రగతిశీల, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, మహిళా సంఘాలు పాల్గొన్నాయి. వ్యవ సాయం, అనుబంధ రంగాలైన ఉద్యానవనాలు, ఆక్వా ఉత్పత్తులకు వేల్యూ అడిషన్‌తో ఫుడ్ ప్రాసె సింగ్ యూనిట్లను ఏర్పాటుకు ముందుకు వచ్చే యువతకు అనుమతులు, రుణాలు, శిక్షణ సాంకేతిక సహకారం ఇస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ జిల్లాలో 100 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. రాష్ట్ర ఛాంబర్ కామర్స్, ఇండస్ట్రీ ప్రతినిధి భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పారిశ్రామిక ప్రగతికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లాలో డ్వాక్రా రుణాల ద్వారా యూనిట్లు స్థాపించి పలువురికి ఉద్యోగ కల్పన అందిస్తున్న మహిళలను కలెక్టర్ సన్మానించారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన యువతకు నియామక పత్రాలు అందించి సత్కరించారు. పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ నీలాద్రి, ఉద్యానవనశాఖ డీడీ రామ్మోహన్ పాల్గొన్నారు.

లక్ష్యం కొండంత.. వసూళ్లు అంతంతే!

» ఆశాజనకంగా లేని పన్ను వసూళ్లు
» శ్రమిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

ఏలూరు టూటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్ల ఆశాజనకంగా లేవు.. ఆర్థిక సంవత్సరం ప్రారం భమై తొమ్మిది నెలలు గడిచిపోయాయి. రాబోయే మూడు నెలల్లో పన్ను వసూళ్ల లక్ష్యం కొండంత ఉంది. నూరుశాతం పన్ను వసూళ్ల లక్ష్యంగా అధికారులు శ్రమి స్తున్నారు. వచ్చే మార్చి 31వ తేదీ లోపు నూరుశాతం వసూళ్ల సాధించడం కష్టసాధ్యంగానే కన్పిస్తోంది. నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను కట్టేవారు 70 వేల 112 మంది ఉన్నారు. తాగునీటి పన్నుదారులు 41,354 మంది, ఖాళీ స్థలంపై పన్ను చెల్లించే వారు 745 మంది ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-2025) రూ.66 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యంగా పెట్టుకోగా డిసెంబరు 31 వరకు కేవలం రూ.24.91 కోట్లు (38 శాతం) వసూలు చేశారు. మార్చి 31 నాటికి ఇంకా 62 శాతం వసూలు చేయాలి.

ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్

పన్ను వసూళ్ల కోసం అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. పన్ను వసూళ్ళకు అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లతో పాటు నలుగురు రెవెన్యూ అధికారులు, నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సహా కిందిస్థాయి మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తో నగర కమిషనర్ భానుప్రతాప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహి స్తున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు సిబ్బంది పన్నుల వసూళ్లకు శ్రమపడు తున్నారు. వాహనాలపై మైక్‌లతో ప్రచారం చేస్తున్నారు.



పన్నుల వసూళ్లకు నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది

నూరుశాతం వసూళ్లు చేస్తాం..



నూరుశాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా శ్రమిస్తున్నాం. ఆస్తి పన్ను లు ఎక్కువగా పాతబకాయిలు ఉ న్నాయి. ఏళ్ల తరబడి పేరుకుపో యాయి. వీరంతా ఎక్కువ శాతం నగరంలో నివసిస్తున్నారు. చాలామంది ఆస్తిదారులు కోర్టు కేసులు వేశారు. పన్నులు అధికంగా ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. అవసరమైతే ఇళ్లను సీజ్ చేస్తాం. పన్ను కట్టని వారికి కుళాయిలు నిలిపి వేస్తాం. నగరాభివృద్ధి కోసం ఆస్తిపన్నులు చెల్లించి ప్రజ లు నగరాభివృద్ధికి తోడ్పడాలి.

- శివారెడ్డి, డిప్యూటీ కమిషనర్



గణపతి సచ్చిదానందను దర్శించుకున్న ఎమ్మెల్యే ధర్మరాజు

కర్మ వదలదు.. వెంటాడుతుంది

ఆకివీడు/ఉంగుటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): 'ప్రజలందరూ ఆధ్యాత్మిక జీవనంతో ముందుకు సాగాలి. స్వార్థం లేకుండా సేవలందించాలి. పాపాలు చేసిన వాళ్లను కర్మ వదిలిపెట్టదు. అది వెంటాడుతూనే ఉంటుంది' అని గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. శనివారం ఆకివీడు దత్త క్షేత్రంలో విశ్వాంబర రాగ సాగర సంగీతాన్ని భక్తులకు అందించి, అనుగ్రహ భాషణం చేశారు. ఆకివీడు దత్తాశ్రమానికి రూ.55 లక్షల చెక్కును ట్రస్టీలకు అందజేశారు. దత్త విజయానంద తీర్థస్వామి, ట్రస్టీలు, భక్తులు ఉన్నారు. అనంతరం ఉంగుటూరు మండలం బాదంపూడి సుబ్రహ్మణ్య దత్తాశ్రమానికి వెళ్లారు. పట్టణాల్లో గోవులు ప్లాస్టిక్ పదార్థాలు తిని అనారోగ్యానికి గురవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఇక్కడ గోసంపదను రక్షించడం ఆనందదాయకమన్నారు. విశేష పూజలు జరిపి అనుగ్రహ భాషణం చేశారు. సుబ్రహ్మణ్యస్వామి యంత్ర ప్రతిష్ట ద్వారా ఈ క్షేత్రం ఎంతో శక్తివంతమైందన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, కలవచర్ల శ్రీనివాసరావు, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం భక్త బృందం పాల్గొని స్వామీజి ఆశీస్సులు పొందారు.

జర్మన్ అబ్బాయి.. ఏపుగుంట అమ్మాయి



టి.నరసాపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జర్మన్ అబ్బాయి.. ఏపుగుంట అమ్మాయిల మనసులు కలిశాయి. ఇద్దరి ప్రేమకు పెద్దలు అంగీకారంతో ఒక్కటయ్యేందుకు మార్గం ఏర్పడింది. ఇరువురికి నిశ్చితార్థం జరిపి పెద్దలు ఆశీర్వదించారు. టి.నరసాపురం మండలం ఏపుగుంటకు చెందిన కూనపాము లావణ్య నాలుగేళ్ల క్రితం రోమన్ క్యాథలిక్ సహకారంతో జర్మనీలోని మెల్లేనగరంలో నర్సింగ్ కోర్సు పూర్తి చేసి, అక్కడే ఓ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. అక్కడే ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న మార్క్యాస్‌తో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వారిలో ప్రేమను చిగురింపజేసింది. విషయాన్ని ఇరు కుటుంబాల వారికి తెలియజేసి, వారి సమ్మతితో వివాహానికి మార్గం సుగమమైంది. ఈ నెల 4న ఏపుగుంట చేరుకున్నారు. శనివారం స్థానిక ఆర్‌సీఎం మత గురువులు, స్థానికుల సమక్షంలో వివాహ నిశ్చితార్థం అంగరంగ వైభవంగా చేసుకున్నారు. వివాహాన్ని జర్మనీలో వచ్చే ఏడాది చేసుకుంటున్నట్లు వారు తెలిపారు.

భక్తులతో పోటెత్తిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా.. అంటూ గోవింద నామాలతో చిన్నతిరుమలేశుని క్షేత్రం శోభిల్లింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయం శనివారం పోటెత్తింది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతోపాటు పంచమి తిథి మంచిది కావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. 20 వేల మంది పైబడి భక్తులు వచ్చి ఉంటారని అంచనా. భక్తులు ముందుగా మొక్కుబడులు తీర్చుకుని, స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

సండే స్పెషల్

హలో.. చ(సె)ల్!



ఎడా పెడా సెల్‌ఫోన్ల వినియోగం

సెల్‌ఫోన్ లేని మనిషి లేడంటే అతిశయోక్తి కాదు.. అవును ఇప్పుడు పేరుతోపాటు మనిషికో నెంబర్.. నలుగురు సభ్యులున్న ఒక కుటుంబంలో కనిష్టంగా నాలుగు నుంచి ఆరు వరకు ఫోన్‌లు ఉంటున్నాయి. కొన్ని కుటుంబాల్లో ఇంటాయనకు కచ్చితంగా రెండు ఫోన్‌లు, నాలుగు సిమ్‌లు ఉండాల్సిందే! ఇంటావిడికి పర్సనల్‌గా ఒక ఫోన్ అదనంగా రెండు సిమ్‌లు, చిన్నపిల్లలు ఉంటే ఫోన్‌లో గేమ్‌లు చూసుకోవడానికి, కార్టూన్ నెట్‌వర్క్‌లకు మరో స్మార్ట్ ఫోన్.. కళాశాలలకు వెళ్లే పిల్లలు ఉంటే హైరిజల్యుషన్ ఫోన్ ఒకటి ఉండాల్సిందే. సెల్‌ఫోన్‌ల వినియోగం ఇంతలా ఉంటే కుటుంబానికి ఆర్థిక భారంతోపాటు అనారోగ్యం కూడా.. జర జాగ్రత్త..

- పాలకొల్లు(ఆంధ్రజ్యోతి)

ఇంట్లో ప్రతి సభ్యుడికీ స్మార్ట్‌ఫోన్.. సిమ్‌లు రెండు..!

నిత్యావసరాల జాబితాలో సెల్‌ఫోన్

అతిగా వాడితే ఆరోగ్యంపై ప్రభావం ..

ఏటా లక్షల ఫోన్ల వినియోగం



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సెల్‌ఫోన్‌ల వినియోగం పెరిగి మంచి ఫలితాలు ఇస్తుండగా మరొక కోణంలో యువతను పెడదోవ పెట్టుస్తున్నది. వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, షార్ట్ వీడియోస్, రీల్స్ ఇలా అనేక విభాగాల వినియోగంతో యువత చదువుకు దూరం అవుతున్నారు. సెల్‌ఫోన్‌లు వినియోగిస్తున్న యువతతో సహా వయోజనులలో ఎక్కువ శాతం మంది అశ్లీలతను వీక్షిస్తున్నట్లు వివిధ సర్వేలలో వెల్లడైంది. సెల్‌ఫోన్ వల్ల ఎంత ఉపయోగం ఉందో ఆ మేరకు నష్టమూ ఉంది. ఇందుకోసం ప్రభుత్వాలు కొన్ని చట్టాలు చేయాల్సి ఉన్నదని నిపుణులు అంటున్నారు.



ఫోన్‌ల భారం నెలకు రూ.వెయ్యి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మధ్య తరగతి కుటుంబాలు, చిన్న కుటుంబాలు అనే భేదం లేకుండా ఒక్కొక్క కుటుంబానికి సెల్‌ఫోన్‌ల రీచార్జిల నిమిత్తం నెలకు కనిష్టంగా రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. వివిధ నెట్‌వర్క్‌లు ఉచితాల ముసుగులో ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌ను నీరుగార్చి ఇప్పుడు ప్రైవేటు సెల్ ఆపరేటర్లు ధరలు పెంచేయడంతో వినియోగదారులకు మరింత భారం పెరిగింది. ఒక పూట కాఫీ లేకున్నా, భోజనం లేకుండా బతికేయవచ్చుగానీ సెల్‌ఫోన్ చెంతన లేదంటే ప్రతి వ్యక్తికి అది ఒక చింతగా మారింది. ఇప్పుడు సెల్‌ఫోన్ వినియోగించే వారిలో సుమారు 20 శాతం మంది ప్రతి ఐదు నిమిషాలకు సెల్‌ను కెలుకుతూనే ఉంటున్నారు. ఇది మానసిక శారీరక ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యంపై ప్రభావం

ఇటీవల సెల్‌ఫోన్‌ల వాడకం విస్తృతంగా పెరగడంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి. బాల్యం, కౌమారం, యవ్వనం, వృద్ధాప్యం అనే దశలు ఉన్నట్టుగానే సెల్‌ఫోన్‌లు వినియోగంలోనూ అనేక ప్రమాదకర తరంగాలు ఉన్నాయి. వీటిని రేడియో తరంగాలు గానూ, సూక్ష్మ తరంగాలు గానూ, పర్యావరణ తరంగాలు, కాంతి తరంగాలు, అతినీల లోహిత తరంగాలు ఇలా ఏ పేర్లతో పిలిచినా తరంగాలు పొడవును బట్టి ఫ్రీక్వెన్సీ మారి అనారోగ్యాన్ని తెచ్చిపెడతాయి. సెల్‌ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని మాట్లాడటం కంటే బల్లపై ఉంచి ఒక తీగను (బ్లూటూత్) ద్వారా వినడానికి ప్రయత్నించాలి. తలకు సెల్‌ఫోన్‌కి దూరం పెంచాలి. శరీరానికి సెల్‌కు దూరంగా ఉంచాలి. సెల్‌ఫోన్ అందుబాటులో ఉంది కదా అని 24 గంటలూ మాట్లాడటం అతి ప్రమాదం. జాగ్రత్తలు తీసుకుంటే సెల్‌ఫోన్‌ల వల్ల నష్టాలు తగ్గుతాయి.

మొబైల్ ఫోన్ అనే ఇంగ్లీష్ పదాన్ని మనం తెలుగులో దూరవాణి లేక చరవాణి అని పిలుస్తాం. మన దేశంలో సెల్‌ఫోన్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావటానికి సమయం పట్టినప్పటికీ జపాన్‌లో 1979లోనే మొబైల్ ఫోన్ వినియోగంలోకి వచ్చింది. 1983లో అమెరికాలో మొబైల్ ఫోన్ ప్రాచుర్యంలోకి వచ్చింది. అప్పుడు దీని బరువు 2.2పౌండ్లు (ఒక కిలో ఉండేది). ఇప్పుడు సెల్‌ఫోన్ బరువు గ్రాముల్లోకి మారింది. సెల్‌ఫోన్ రంగంలో మరింత ఆధునికత పెరిగి ఫిన్‌లాండ్ దేశంలో 1991లో 2వ తరం (2జీ ఫోన్‌లు వచ్చాయి) 2001లో 3జీ ఫోన్‌లు, ఆ తర్వాత 4జీ ఇప్పుడు 5జీ వైపు అడుగులు వెయ్యగా రానున్న రోజుల్లో మరింత సాంకేతికత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

రూ.20 వేలకు ఫ్యాన్సీ నెంబరు

'నా వద్ద ఇప్పటికే మూడు సిమ్‌లు ఉన్నాయి. ఫ్యాన్సీ నెంబరు బాగుండడంతో రూ.20 వేలు చెల్లించి మరో సిమ్ కొన్నా. నా రెండు ఫోన్‌లలో నాలుగు నెట్‌వర్క్‌ల సిమ్‌లు వేశా. ఒక్కొక్క సందర్భంలో ఒక్కో నెట్‌వర్క్ వాడుతుంటా. వ్యాపార రీత్యా బయటకు వెళ్లినప్పుడు కొన్ని ప్రాంతాల్లో కొన్ని నెట్‌వర్క్‌లకు సిగ్నల్ ఉండదు. అప్పుడు ఈ సిమ్‌ల ద్వారా అదనపు నెట్‌వర్క్‌లో వాడుకుంటా. నెలకు రూ.1500 వరకు అవుతుంది' అని లోక్‌నాథ్ చెప్పారు.

అప్పుల బాధ భరించలేక సిమ్ మార్చేశా

పాలకొల్లు మండలానికి చెందిన విఘ్నేష్ (పేరు మార్చడమైనది) రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈ వ్యాపారం మందగించడంతో రుణాలు పెరిగిపోయాయని రుణగ్రహీతల నుంచి ఒత్తిడి తట్టుకోలేక తరచూ సిమ్‌లు మార్చాల్సి వస్తోందని అతను చెబుతున్నాడు. విపత్కర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గం లేకే ఈ విధంగా చేస్తున్నా. అయినప్పటికీ పర్సనల్ నెంబరు ముఖ్యులకు తప్ప ఎవరికీ ఇవ్వను. తరచూ మార్చే నెంబర్లు మాత్రమే ఇస్తానంటున్నాడు.

వెలుగులివ్వని సూర్యఘర్



భీమవరం టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం సూర్యఘర్ పథకానికి పశ్చిమ గోదావరి జిల్లాలో వినియోగదారుల నుంచి ఆశించినంత మద్దతు లభించటంలేదు. విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించినా అనుకున్నంత మంది ముందుకు రాలేదు. జిల్లాలో ఈ పథకం నత్త నడకన సాగుతోంది. సబ్సిడీతో కూడిన ఈ పథకంలో చేరేందుకు వినియోగదారులు ఎందుకు ముందుకు రావటంలేదో అర్థంకాక విద్యుత్‌శాఖ అధికారులు లెక్కలు వేస్తున్నారు. ప్రభుత్వాలు మాత్రం ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి విద్యుత్‌ను ఆదా చెయ్యాలనే ఆలోచన చేస్తోంది. సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుంటే బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కూడా ఈ పథకానికి ఉంది.

538 మందికి ప్యానల్స్ బిగింపు

ఈ పథకంపై విద్యుత్ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తగా ఇంటింటి ప్రచారం చేసినపుడు దాదాపు 11,270 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేందుకు మాత్రం 780 దరఖాస్తులు విద్యుత్‌శాఖకు అందాయి. ఇందులో 538 మంది కి మాత్రం ప్యానల్స్ బిగింపు పూర్తి చేశారు. మీటర్లును మాత్రం 504మందికి మాత్రమే ఏర్పాటు చేశారు. మిగిలిన వారికి త్వరలో ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. మిగిలిన 242 మంది దరఖాస్తుదారులు సొమ్ము చెల్లించాల్సి ఉంది.

మిగులు విద్యుత్ అమ్ముకోవచ్చు

సోలార్ ప్యానల్స్ ద్వారా విద్యుత్ వినియోగం చేసుకుంటే యజమానికి ఎంతో ప్రయోజనం ఉంది. విద్యుత్ చార్జీలు చెల్లించే టారిఫ్‌లోను, అదే విధంగా గ్రిడ్‌కు ఇచ్చిన విద్యుత్‌కు రూ.2-09 పైసలు యజమానికి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. అంతే కాకుండా ఏరోజు ఎంత విద్యుత్ ఉత్పత్తి అయింది. గ్రిడ్‌కు ఎంత విద్యుత్ ఇచ్చారు. అనేది మెసేజ్ రూపంలో సెల్ ఫోన్‌కు సమాచారం వస్తుందని చెబుతున్నారు.

సోలార్ విద్యుత్‌కు స్పందన అంతంతమాత్రమే!

ఆసక్తి చూపని వినియోగదారులు

అపార్ట్‌మెంట్‌లకు వర్తింపు

గతంలో 2019 నుంచి 2024వ సంవత్సరం వరకు ఈ పథకం మన రాష్ట్రంలో అమలులో ఉంది. అప్పట్లో జిల్లాలో 150 మంది వినియోగదారులు కనెక్షన్‌లు వేయించుకున్నారు. అప్పట్లో కేంద్రం రూ.30వేలు, రాష్ట్రం రూ.20వేలు సబ్సిడీగా ఇచ్చేవారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని ఇస్తున్నంది. ఈ పథకాన్ని అపార్ట్‌మెంట్‌లకు కూడా వర్తిస్తున్నారు. ఏ అపార్ట్‌మెంట్ వాసులైన ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనిపై ఇటీవల జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ రఘునందన్‌రావు అవగాహన కల్పించారు. పాఠశాలలు, ఆఫీసులు, షాపులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని వివరించారు.

కాల్ సెంటర్ ఏర్పాటు

సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించటానికి, ఇతర వివరాలు, సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవటంపై వివరాలు తెలిపేందుకు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 9490610152 నంబరుకు ఫోన్‌చేస్తే సమాచారం అందిస్తారు.

విముఖతకు కొన్ని కారణాలు

సోలార్ విద్యుత్ ను ఏర్పాటు చేసుకోవటంలో సామాన్యులు కొంత వెనుకడుగు వేస్తున్నారు. దీనికి కారణంగా అనువైన స్థలం లేకోపవటం, బిల్డింగ్ పై వేసుకుంటే స్థలం ఉండదనే బావన, ముఖ్యంగా దాదాపు 78వేలు రూపాయలు పెట్టుబడి పెట్టేంత స్తోమత లేకపోవటంతోపాటు సోలార్ బ్యాటరీల కాలపరిమితిపై అనుమానాలు, తదితర కారణాల వల్ల ముందుకు రావటం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అవగాహన కల్పిస్తాం



సోలార్ విద్యుత్ ఏర్పాటుకు తమ శాఖ ద్వారా మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. కరపత్రాల ద్వారా ఇప్పటికే ప్రచారం చేశాం. మరింత మంది ఏర్పాటుచేసుకునేలా వినియోగదారులకు అవగాహన కల్పిస్తాం.

- ఎస్‌ఈ రఘునందన్‌రావు

వేల జీతం వదులుకుని ప్రకృతి వ్యవసాయం వైపు..





వెల్లమిల్లిలో రాజేంద్రప్రసాద్ సాగు చేసిన ముల్లంగి

ఉన్నత విద్యనభ్యసించి వేలాది రూపాయల జీతం వస్తున్న ఉద్యోగాన్ని వదలుకొని ప్రకృతిపై ఉన్న మక్కువతో స్వగ్రామం వచ్చి పంటల సాగు చేపట్టారు.. చుట్టు పక్కల గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలిచాడు..తన తండ్రి అడుగు జాడల్లో తన అభిరుచికి తగ్గట్టు పలు రకాల పంటల సాగుకు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.. ఉంగుటూరు మండలం వెల్లమిల్లికి చెందిన పరిమి రాజేంద్ర ప్రసాద్.. రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో అందించిన ప్రోత్సాహంతో తనకున్న పొలంలో వరి విత్తన పంటతో పాటు కోకో, కొబ్బరి, అరటి, పండ్ల మొక్కలు పెంచుతున్నారు.. ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఔషధ గుణాలున్న బొప్పాయి, సీతాఫలం వంటివి సాగు చేయడం విశేషం. పలు కూరగాయల విత్తనాలు సాగు చేసి ఆదాయం సంపాది స్తున్నారు.. 12 రకాల కూరగాయల సాగు చేస్తున్నట్టు చెబుతున్నారు.. సంతృప్తికరమైన ఆదాయం వస్తున్నదని రాజేంద్ర వివరించారు. మండలంలోని తన పొలంతో పాటు నాచుగుంట తదితర ప్రాంతాల రైతు క్షేత్రాలను వివిధ దేశాల రైతులు, ప్రజా ప్రతినిదులు సందర్శిస్తున్నారని చెప్పారు. తన పొలంలో ఉన్న మామిడి జాతుల పెంపకంపై పలు రాష్ట్రాల రైతు ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు వివరించారు..

- ఉంగుటూరు, ఆంధ్రజ్యోతి

మరింత మద్యం



కల్లు గీత కార్మికులకు షాపులు

కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల నిర్వహణలో భాగస్వామ్యం కల్పిస్తామంటూ ఎన్నికల ముందు తెలుగుదేశం కూటమి హామీ ఇచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 18, ఏలూరు జిల్లాలో 14 మద్యం షాపులను గీత వృత్తిదారులకు కేటాయించనున్నారు. ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేసింది. త్వరలోనే దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. పది శాతం షాపులను గీత వృత్తిదారులకు కేటాయిస్తామంటూ ఎన్నికల హామీలో ఇచ్చినట్లే అమలు చేస్తోంది. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి లాటరీ పద్ధతిలో షాపులను ఎంపిక చేస్తారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల హామీ అమలుకు ఆలోచన

పశ్చిమలో 15 షాపులకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

లాటరీ పద్ధతిలోనే ఎంపిక

స్పందన ఎలా ఉంటుందో..

అధికారుల తర్జన భర్జన

ఇప్పటికే 175 మద్యం షాపులు

కమీషన్ తక్కువగా ఉందంటూ లైసెన్స్ దారులు ఆందోళన

రాష్ట్రవ్యాప్తంగా 340 షాపులను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో గీత కార్మికులకు 10 శాతం అంటే 18 షాపులు వచ్చే అవకాశం ఉందని అంచనా. గతంలోనే 175 షాపులకు లైసెన్స్‌లు ఇచ్చారు. కల్లు గీత వృత్తిదారులకు రిజర్వేషన్‌లో భాగంగా 10 శాతం ఇవ్వనున్నారు. గీత కార్మికుల నుంచి స్పందన ఎలా ఉంటుందనే విషయమై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ప్రైవేటు మద్యం షాపుల్లో జిల్లావ్యాప్తంగా గట్టి పోటీ నెలకొంది. ఉండి నియోజకవర్గ పరిధిలోనే కాస్త తక్కువగా దరఖాస్తులు పడ్డాయి. ఇతర చోట్ల మద్యం వ్యాపారులు పోటీ పడ్డారు. ఒక్కో షాపు దక్కించుకోవడానికి సగటున రూ.50 లక్షలు వెచ్చించాల్సి వచ్చింది. ప్రభుత్వానికి ఒక్కో దరఖాస్తు కోసం రూ.2 లక్షల డీడీ చెల్లించాలి. పోటీ అధికమై లైసెన్స్‌దారులు అత్యధికంగా దరఖాస్తులు చేసుకున్నారు. షాపులు పెట్టిన తర్వాత నష్టాలు వస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు.

కమీషన్ పెంపుకోసం ఎదురుచూపులు

మద్యం షాపుల నోటిఫికేషన్‌లో 20 శాతం కమీషన్ ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. దాంతో మద్యం వ్యాపారులంతా ఆశపడ్డారు. లైసెన్స్ దక్కించుకోవడానికి ఎగబడ్డారు. సిండికేట్‌లుగా ఏర్పడి దరఖాస్తులు చేసుకున్నారు. తీరా షాపులు లభించిన తర్వాత 9 శాతమే కమీషన్ వస్తుందంటూ లెక్కలు వేసుకున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి లైసెన్స్ ఫీజు చెల్లించడానికి ఆపసోపాలు పడుతున్నారు. అప్పులు చేస్తున్నారు. బెల్ట్ పాయింట్‌లు ఏర్పాటు చేసుకుంటే వినియోగం పెరుగు తుందని ఆశించారు. దానిపైనా ప్రభుత్వం ఇప్పుడు ఉక్కుపాదం మోపుతోంది. ఎక్సైజ్ శాఖ దాడులు చేసి. కేసులు నమోదు చేస్తున్నారు.సిట్టింగ్ గదులకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే సిట్టింగ్ ఏర్పాటు చేసుకోవడానికి ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. నేతల ఆశీస్సులు ఉన్నవారు కొందరే సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసుకుని మద్యం అమ్ముతున్నారు. అటువంటి చోట్ల కాస్త అమ్మకాలు ఎక్కువగా ఉంటున్నాయి. జిల్లాలో కేవలం 10 శాతం మంది వ్యాపారులకు మాత్రమే కాస్త ఊరట లభించింది. ప్రభుత్వంపై వివిధ రూపాల్లో ఒత్తిడి తీసుకు వచ్చే ప్రయత్నం చేశారు. అయితే 14 శాతం కమీషన్ లభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దానికోసం లైసెన్స్‌దారులు ఎదురు చూస్తున్నారు.

అద్దెలు పెంచేసి..

వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం షాపులు ఏర్పాటు చేశారు. తక్కువ అద్దెకు షాపులను తీసుకుని ప్రభుత్వానికి రూ.38 వేలకు ఇచ్చారు. మధ్యలో వైసీపీ నేతలు, దళారులు లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం ప్రయివేటు మద్యం పాలసీని అమలు చేయడంతో లైసెన్స్ దారులు ముందుకొచ్చారు. కొత్త వారు దరఖాస్తు చేసుకున్నారు. లైసెన్స్ దక్కించుకున్న తర్వాత షాపులను ఏర్పాటు చేయడానికి అద్దెలను అమాంతంగా పెంచేశారు. కొన్ని షాపులు నెలవారీ అద్దె లక్ష రూపాయల వరకు చెల్లిస్తున్నారు. ఒకవైపు ఆశించినస్థాయిలో కమీషన్ రావడం లేదు. మరోవైపు సిండికేట్ ఆశలు నెరవేరడం లేదు. నిర్వహణ భారం పెరిగింది. నష్టాలు చూడాల్సి వస్తుందంటూ లైసెన్స్‌దారులు మొల్లుమంటున్నారు. ప్రభుత్వం బీరు, మద్యం ధరలు తగ్గించడంతో వినియోగం పెరిగింది. కానీ నగదు రూపంలో టర్నోవర్ తగ్గుతోంది. దానివల్ల కమీషన్ అనుకున్నంత రావడం లేదు. ఆ తరుణంలో గీత కార్మికుల షాపులపై స్పందన ఎలా ఉంటుందో ?.

ఏలూరు జిల్లాలో 14 షాపులు

ఏలూరు జిల్లాలోని 141 మద్యం షాపుల్లో పది శాతం కల్లు గీత కార్మికుల్లో వివిధ ఉప కులాల రేషియా ప్రకారం కేటాయించనున్నారు. ఈ లెక్కన 14 షాపుల వరకు శెట్టిబలిజ, ఈడిగ, ఈత వర్గాలకు కేటాయించే అవకాశం ఉన్నట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులు చెబుతున్నారు. నేడో, రేపో అధికారిక జీవో రాగానే ఆయా వర్గాలకు షాపులను కేటాయిస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు.



ఆకట్టుకున్న భరతనాట్యం

భీమవరం టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):మావుళ్ళమ్మ జాతర మహోత్సవాల్లో శనివారం రాత్రి కొటికలపూడి గోవిందరావు కళావేదికపై చేసిన భరతనాట్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నటరాజ నృత్యనికేతన్, రాజమండ్రి శివకేశవ ముత్యాలయం, కూచిపూడి నాట్యమండలి, పాలకొల్లు కళాంజలి నృత్యనికేతన్ భరత నాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి.






ఆరవల్లిలోని యోగి వేమన విగ్రహం.. అత్తిలి సమీపంలో వేమన విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి.. చిత్రంలో సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి తదితరులు

వేడుకగా యోగి వేమన జయంతి

ఆరవల్లిలో పండుగ .. భారీగా తరలి వచ్చిన జనం

అత్తిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మానవ జీవితానికి సంబంధించిన అనేక నిత్యసత్యాలను తనదైనశైలిలో తేట తెలుగు పదాలతో వర్ణించి తెలుగువారి హృదయాల్లో చిరస్మరణీయునిగా నిలిచిన ప్రజాకవి యోగి వేమన. అత్తిలి మండలం ఆరవల్లిలో వేమనకు మందిరాన్ని నిర్మించి, ప్రతి ఏడాది జనవరి 18న వేమన జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం యోగివేమన 100వ జయంతి ఉత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. వేకువ జామున వెలగల దాసు వంశీయులు వేమనకు గోస్తనీ నది స్నానం చేయించారు. వేమన మందిరాన్ని పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేమనను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కీర్తనలు, కోలాట భజన, సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాండు మేళాలు, మంగళవాయిద్యాల నడుమ, బాణసంచాకాల్పులతో విశేషంగా అలంకరించిన పల్లకీపై వేమన చిత్రపటాన్ని ఉంచి గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన గృహోపకరణ, ఫ్యాన్సీ వస్తు దుకాణాల వద్ద సందడి నెలకొంది. వేమన జయంతి సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వేమన ఉత్సవ కమిటీ ఛైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, స్థానిక ప్రముఖులు సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, వెలగల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శునకాలకు అన్నదానం

ఆరవల్లి వేమన జయంతి ఉత్సవాలలో భాగంగా గ్రామ సింహాలైన శునకాలకు అన్నదానం చేశారు. పలు రకాల ఆహార పదార్థాలను కావిడి పెట్టుకుని గ్రామంలో తిరుగుతూ కనిపించిన శునకాలకు విస్తరివేసి, ఆహార పదార్థాలను వడ్డించారు.

వేమన చిరస్మరణీయుడు: ఆరిమిల్లి

అత్తిలి నుంచి ఆరవల్లి వెళ్ళే రహదారిలో వేమన శతజయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీయోగి వేమన విగ్రహాన్ని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శనివారం ఆవిష్కరించారు. వేమన పద్యాలు నేటి తరానికి ఆదర్శ ప్రాయమని అన్నారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత కొవ్వూరి అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



తణుకు పరీక్ష కేంద్రంలో ప్రశ్నపత్రాల బండిళ్ళను పరిశీలిస్తున్న జేఎన్‌వీ ప్రిన్సిపాల్ , తదితరులు

ఏలూరు అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పరీక్ష ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. వివరాలను పరీక్ష ఉమ్మడిజిల్లా నిర్వాహకులు, పెదవేగి జేఎన్‌వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, పరీక్షకు 5828 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 3588 మంది (61.56 శాతం) హాజరయ్యారని వివరించారు. ఏలూరు జిల్లాకు సంబంధించి 13 కేంద్రాల్లో మొత్తం 3148మంది విద్యార్థులకు గాను 1455 మంది హాజరయ్యారని డీఈవో వెంకట లక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ వివరించారు. ఆకివీడు, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, పెనుమంట్ర, పోడూరు, తాడేపల్లిగూడెం, తణుకు, ఏలూరు, భీమడోలు, చింతలపూడి, గణపవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, నూజివీడు, మండవల్లి, కైకలూరులలో ఈ పరీక్ష జరిగింది. ఓఎంఆర్ జవాబుపత్రాలను సాయుధపోలీసు భద్రతతో శనివారం రాత్రి హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. పరీక్ష ఫలితాలు మార్చి/ఏప్రిల్‌లో ప్రకటించే అవకాశం ఉంది. కాగా తణుకు, పోడూరు, పాలకొల్లులోని పరీక్ష కేంద్రాలను జేఎన్‌వీ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, ఏలూరులోని కేంద్రాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ, చింతలపూడిలోని పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ తనిఖీ చేశారు



విన్నర్‌గా నిలిచిన మహారాష్ట్ర జట్టుతో కలెక్టర్, ఎస్పీ

కబడ్డీ విజేతలు మహారాష్ట్ర, సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ జట్లు

ముగిసిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

నరసాపురం టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో ఐదు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు శనివారం అర్ధరాత్రి ముగిశాయి. పురుషుల విభాగంలో విన్నర్‌గా మహారాష్ట్ర, రెండో స్థానంలో కోల్‌కత్తా, తృతీయ సీఆర్పీఎఫ్ ఢిల్లీ, నాల్గోవ స్థానంలో కోల్‌కత్తా పోలీస్ జట్లు నిలిచాయి. మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో సీఆర్పీఎఫ్ ఢిల్లీ, ద్వితీయ స్థానంలో రాజస్థాన్, తృతయ కేరళ, నాల్గోవస్థానంలో కోల్‌కత్తా జట్టు నిలిచింది. మొదటి స్థానంలో నిలిచిన జట్లకు రూ.1.50 లక్షలు నగదు, షీల్డ్, ద్వితీయ జట్టుకు రూ.లక్ష, తృతయ రూ75వేలు, నాల్గోవ స్థానంలో నిలిచిన జట్లకు రూ.50 చొప్పున ప్రైజ్ మనీతో పాటు గోగులమ్మ ఉత్సవ కమిటీ తరుపున షీల్డ్‌ను జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, పోటీలు కన్వీనర్ జానకీరామ్ అందించారు.

30ఏళ్లుగా పోటీలు నిర్వహించడం అభినందనీయం

గ్రామీణ క్రీడైన కబడ్డీని మూడు దశబ్ధాలుగా జాతీయ స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. విజేతలకు బహుమతులు అందించి మాటాడారు. ఎస్పీ నయీం మాట్లాడుతూ పండుగ సమయాల్లో యువత చెడు వ్యసనాల వైపు వెళ్ళ కుండా అనేక వ్యయప్రయాసలోర్చి జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయవన్నారు. ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సీఈవో వీరలంకయ్య, అడబాల బాబులు, వలవల ప్రసాద్, వన్నెంరెడ్డి శ్రీను, గుగ్గిలపు మురళీ, పోలిశెట్టి శ్రీనివాస్, గోపి, గంధ రవి, మమ్ము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార చిట్స్



భారీగా డిపాజిట్ల సేకరణ.. ఆపై ఉడాయింపు

బలవుతున్న అమాయకులు

ఏలూరు క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కరోనా తరువాత ఎక్కువ మంది ప్రజలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుపోయారు. ఆర్థికంగా చేయూత ఇచ్చేవారివైపు, సాయం చేసే వారిపై ఆశగా చూస్తున్నారు. ఇదే అదనుగా తీసుకున్న కొంతమంది వ్యాపారులు చిట్టీల పేరుతో మభ్యపెట్టి కట్టించుకుంటున్నారు. అనధికారికంగా నిర్వహిస్తూ చిన్న చిన్న చిట్టీలుగా మొదలు పెట్టి ఏకంగా లక్షలాది రూపాయల వరకు నిర్వహిస్తున్నారు. ఎక్కడా వీరు ఏ చిట్టీకి రిజిస్ట్రేషన్ చేయకుండానే కొనసాగిస్తున్నారు. బంధువుల ద్వారానో, స్నేహితుల ద్వారానో ఒకరి నుంచి ఒకరు చైన్ లింకుగా ఈ కార్యకలాపాలను జిల్లాలో కొనసాగిస్తున్నారు. ఎంతో నమ్మకంగా కొంత కాలం పాటు కొనసాగించి ఆపై చేతులెత్తేస్తున్నారు. మరికొంత మంది ఐపీ పెట్టేస్తున్నారు. జిల్లాలో అనధికార చిట్టీల బాధితులు ఎందరో ఉన్నారు. పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగడం లేదని బాధితులు వాపోతున్నారు. అనధికార చిట్టీలు వేయడమే తప్పని వారి వద్ద ప్రస్తుతం ఏమి లేవని అరెస్టు చేసి కోర్టుకు పంపిస్తున్నామని చట్ట ప్రకారం పోలీసులు తమ పని చేస్తున్నామంటూ చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో బాధితులు లబోదిబో మంటూ తమకుటుంబ అవసరాలకు మరో కాల్ మనీ వ్యాపారుల నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు తీసుకుంటున్నారు. ఏలూరు నగరంలోని మూడు పోలీస్ స్టేషన్లలో అనధికార చిట్టీల కేసులు నమోదు అయి ఉన్నాయి. ఏలూరు నగరంలో పేద ప్రజలు నివశించే ప్రాంతాల్లోనే ఈ అనధికార చిట్టీలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. తొలుత ఆ ప్రాంత ప్రజలను పరిచయం చేసుకోవడానికి కిళ్ళీ షాపో, కిరణాషాపో, కూరగాయల షాపో ఏర్పాటు చేసి పరిచయాలు చేసుకుంటూ చిట్టీ పాటలను కట్టే విధంగా ప్రోత్సహిస్తూ మాయమాటలు చెబుతున్నారు. వీరి మాటలు నమ్మిన అమాయక ప్రజలు తమ స్థాయికి మించి కూడా రోజు కష్టాన్ని మొత్తం తెచ్చి చెల్లిస్తున్నారు. కొంత మంది రోజువారిగా కడుతుండగా, మరి కొంత మంది వారం, మరికొంత మంది నెల చిట్టీలు కడుతున్నారు.

పాడుకున్న సమయంలో మాత్రం పాడిన సొమ్ము ఇవ్వాలంటే ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు పెట్టించుకోవడం, సంతకాలు పెట్టిన ఖాళీ చెక్కులను తీసుకుంటున్నారు. అంతే కాకుండా షూరిటీ కూడా పెట్టాలని మరొకరితో కూడా ఇదే విధంగా సంతకాలు తీసుకుంటున్నారు. కానీ కొంత మంది పాడిన సొమ్ము ఇవ్వకుండా తమ వద్దే ఉంటే ఎక్కువ వడ్డీ ఇస్తామని నమ్మబలికి ఒకటి రెండు నెలలు వడ్డీ ఇచ్చి ఆ పై మిన్నకుండిపోతున్నారు. ఇటీవల ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళ ఇదే విధంగా చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు

పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తూరునకు చెందిన ఒక వ్యక్తి 20 ఏళ్ళ క్రితం వేరే ప్రాంతం నుంచి వచ్చిన ఆ గ్రామంలో కిరణా షాపు పెట్టి అందరితో పరిచయాలు పెంచుకుని చిట్టీలు నిర్వహించి గత నెలలో సరుకులకు అని ఏలూరు వచ్చి మోటారు సైకిల్ కొత్త బస్టాండ్‌లో పెట్టి ఆ పై హైదరాబాద్ వెళ్ళిపోయాడు. అతని భార్య ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టడంతో పోలీసులు అతని ఆచూకీ కనుగొని తీసుకువచ్చారు. అతను ఎంతో నమ్మకంగా చిట్టీలు నిర్వహించి ప్రజల నుంచి సొమ్ములను అనధికారికంగా డిపాజిట్లు చేయించు కున్నారు. మొత్తం 7, 8 కోట్ల రూపాయల వరకూ ప్రజల నుంచి డిపాజిట్లను సేకరించుకుని ఆపై చేతులు ఎత్తేశాడు. దీంతో బాధి తులు లబోదిబో మంటూ పెదపాడు పోలీసులను ఆశ్రయించారు. జిల్లాలో ఇలాంటి అనధికార చిట్టీలు నిర్వహించి ప్రజలను మోసగి స్తున్నా సంబంధిత అధికారులు వారిపై చర్య లు తీసుకోవడంలో విఫలం చెందుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆహ్లాదం, ఆనందం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్



కోర్టు ఆవరణలో కట్టర్ మిషన్‌తో గడ్డి తొలగిస్తున్న జిల్లా జడ్జి పురుషోత్తమ కుమార్

ఏలూరు క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకరంగా ఆనందంగా ఉంటుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ అన్నారు. హైకోర్టు ఉత్తర్వులు మేరకు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్‌తో పాటు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు. కోర్టు ఆవరణలోని పిచ్చి మొక్కలను చెత్త చెదారాన్ని తొలగించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ స్వయంగా కట్టర్ మిషన్‌తో గడ్డి మొక్కలను తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుకి వచ్చే న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి తామంతా పరిసరాల పరిశుభ్రత-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యాని పొందగలమని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు బార్ అధ్యక్షులు కోనే సీతారామ్, ఉపాధ్యక్షులు మాండ్ రాజేంద్ర, గవర్నమెంట్ ప్లీడర్ బీజే రెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల తమ ప్రాణాలు కాపాడుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో హెల్మెట్ ధారణ- ప్రమాదాల నివారణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ మాట్లాడుతూ రిట్ పిటీషన్ 116/2024 ఆర్డర్ ప్రకారం హెల్మెట్ ధారణ వలన కలిగే ప్రయోజనాలు, ప్రమాదాలను నివారించడంపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, ఈ ప్రక్రియలో భాగంగా న్యాయశాఖ ఉద్యోగస్తులకు, న్యాయవాదులకు, న్యాయవాద గుమస్తాలకు, స్థానిక ప్రజలకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాల పైన అవగాహన కల్పించారు. వాహనదారులతో పాటు సహప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాలని, అలాగే కారులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీటుబెల్ట్‌ను ధరించాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్, ప్రభుత్వ న్యాయవాది బిజె రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి
తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోకి వచ్చి దుస్తులు కొనుగోలు చేసి తిరిగి వెళ్తున్న ఒక బాలుడిని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన బొర్రా కోటేశ్వరరావు అనే బాలుడు శనివారం ఉదయం పట్టణంలో దుస్తులు కొనుగోలు చేశాడు. తిరిగి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా గులాబీ సెంటర్ వద్దకు వెళ్ళేసరికి ఒక ట్రాక్టర్ అతను తీసుకువెళుతున్న బ్యాగ్‌కు ట్రక్కు కొక్కెం తగిలి కిందపడిపోయాడు. ట్రాక్టర్ కొంత దూరం లాక్కెళ్ళిపోయింది. దీంతో స్థానికుల సహాయంతో బాలుడిని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

క్రైమ్ కార్నర్

రొయ్యల వ్యాపారి కిడ్నాప్ కేసులో ట్విస్ట్‌లు

- ఇంటెలిజెన్స్ పోలీసులమంటూ సఫారీల్లో వచ్చి కిడ్నాప్
- గత ప్రభుత్వ హయాంలో కొన్ని పంచాయితీలు
- చివరికి వ్యాపారిని కాపాడిన పోలీసులు



కిడ్నాప్‌కు గురైన వ్యాపారి నాని

భీమవరం క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఈ నెల 16వ తేదీన కిడ్నాప్‌కు గురైన రొయ్యల వ్యాపారి విశ్వనాథుని వెంకట సత్యనారాయణ (నాని) కేసులో కొన్ని ట్విస్ట్‌లు వెలుగులోకి వచ్చాయి. మొత్తం మీద నగదు బకాయి విషయంలోనే కిడ్నాప్ జరిగినట్లుగా పోలీసులు దర్యాప్తులో వెల్లడైనట్లుగా సమాచారం. వివరాల్లోకి వెళితే నానికి అనంతపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు నగదు లావాదేవీలు ఉన్నాయి. ఒక వ్యక్తికి సుమారు రూ.2 కోట్ల 65 లక్షలు, మరొక వ్యక్తికి సుమారు కోటీ 70 లక్షలు వరకు బకాయిలు ఉన్నాయి. ఈ లెక్కలు 2020 సంవత్సరం నాటివి. వారిద్దరు గత ప్రభుత్వ హయాంలో కొందరి నాయకుల వద్ద సిట్టింగ్‌లు కూడా పెట్టారు. కానీ ఫలితం దక్కలేదు. దీంతో నానిని ఎలాగైనా అనంతపురం తీసుకువెళ్ళి డబ్బులు రాబట్టాలని, లేనిపక్షంలో ఏదైనా చెయ్యాలని వారిద్దరూ నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీంతో అనంతపురానికి చెందిన ఒక వ్యక్తితో కిడ్నాప్ వ్యవహారం చర్చించుకున్నారు. ఆ వ్యక్తి సుమారు 8 మందిని పురమాయించినట్లుగా తెలిసింది. దీంతో బకాయిలు రావాల్సిన వారిద్దరూ భీమవరంలో కిడ్నాప్‌కు ముందు రెండు రోజులు ఆరా తీశారు. చివరకు ఈ నెల 16వ తేదీన టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఒంటరిగా ఉన్న నానిని సఫారీలో వచ్చిన దుండగులు తాము ఇంటెలిజెన్స్ పోలీసులమని చెప్పి బలవంతంగా తీసుకువెళ్ళిపోయినట్లు సమాచారం. అప్పటికే కిడ్నాప్‌కు ప్నాగం రచించిన వ్యక్తి విజయవాడలో కాపు కాసి నానిని తీసుకువెళుతున్న కారును వెంబడించుకుంటూ అనంతపురం వెళ్ళారని సమాచారం. నాని కుమారుడు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన టూటౌన్ సీఐ కాళీచరణ్ కేసును ఛేదించారు. అనంతపురం పోలీసుల సహకారంతో వారిని పట్టుకున్నట్లు సమాచారం. పోలీసులు సకాలంలో స్పందించకుంటే పెద్ద ఘోర మే జరిగేదని ప్రచారం జరుగుతున్నది. ఒకటి రెండు రోజుల్లో నిందితులను పోలీసులు అరెస్ట్ చూపించే అవకాశం ఉంది.

ఆటో పార్కింగ్‌పై వివాదం
యువకుడికి తీవ్ర గాయాలు

ముదినేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆటో పార్కింగ్ విషయమై ఇద్దరు వ్యక్తుల మధ్య కొట్లాటకు దారి తీసిన సంఘటన పేరూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామానికి చెందిన బొర్రా మనోగాంధీ తన కారును తన ఇంటి బయట నిత్యం రాత్రిళ్ల నిలిపి ఉంచుతాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి ఆ ప్రదేశంలో అదే గ్రామానికి చెందిన వడ్డీలు అనే వ్యక్తి తన ఆటోను నిలిపి ఉంచగా, ఆటోను తీసేయమని గాంధీ అడిగిన సందర్భంలో ఇరువురి మధ్య వివాదం తలెత్తి గొడవకు దారి తీసింది. ఈ గొడవలో వడ్డీలు మరో ఇద్దరు వ్యక్తులు కలసి కర్రలతో గాంధీని కొట్టారు. గాంధీని గుడివాడ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

పంట బోదెలో పడి చిరుద్యోగి మృతి

నరసాపురం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టవరం గ్రామంలో పంటబోదెలో పడి చిరుద్యోగి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. రూరల్ ఎస్సై టీవీ సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం చిట్టవరం గ్రామానికి చెందిన బాల సూర్యనారాయణ (41) పట్టణంలోని ఓ కిరాణా షాపులో పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఇంటికి వెళతుండగా బైకు అదుపుతప్పి పంటబోదెలో పడిపోయింది. నీళ్లలో పడిపోయిన సూర్యానారాయణపై బైక్ పడటంతో నీటిలోంచి బయటకు రాలేకపోయాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా సూర్యనారాయణ ప్రమాదంలో మృతి చెందిన్నట్లు గుర్తించారు. వీఆర్వో కనకదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



గ్రామస్తులు చెబుతున్న విషయాలను వింటున్న డీఎల్‌పీవో చంద్రశేఖర్

పెదవేగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నడిపల్లి గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలపై డీఎల్‌పీవో కేపీ.చంద్రశేఖర్ శనివారం విచారణకు వచ్చారు. అయితే డీఎల్‌పీవో చేసే విచారణతో తమకు న్యాయం జరుగదంటూ గ్రామస్తులు గో బ్యాక్ డీఎల్‌పీవో అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ విచారణకు అడ్డుపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. నడిపల్లిలో గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలకు ఇసుక తవ్వకాల్లో సీనరేజీ పేరిట రూ.30లక్షలకుపైగా సొమ్మును పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి వసూలు చేశారని, ఈ సొమ్మును పంచాయతీలో జమచేయలేదని, ఆ సొమ్ము ఏమైందో తెలియపర్చాలంటూ గ్రామానికి చెందిన పెనమలూరి సురేష్, జుజ్జువరపు సురేష్, మద్దాల గోపాలరావు పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సైతం ఫిర్యాదు కాపీని పంపించారు. దీనిపై గతంలో రెండు దఫాలు డీఎల్‌పీవో గ్రామానికి వచ్చి విచారణ చేశారు. కానీ ఫిర్యాదు దారులు మాత్రం విచారణకు హాజరుకాలేదు. తాజాగా మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీవో చంద్రశేఖర్ మూడోసారి విచారణకు వచ్చారు. కానీ ఫిర్యాదుదారులు మాత్రం డీఎల్‌పీవో విచారణతో మాకు న్యాయం జరుగదని, అంతకు పైస్థాయి అధికారితో విచారణ జరిపించాలని కోరుతూ గో బ్యాక్ డీఎల్‌పీవో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈవో పీఆర్డీ షరీఫ్, నడిపల్లి సర్పంచ్ మేకా అప్పాయమ్మ, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలిక అనుమానాస్పద మృతి

టి.నరసాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):మైనర్ బాలిక అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదే గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటివద్ద ఉంటున్నది. శనివారం ఉదయం బాత్‌రూమ్‌కి వెళ్ళి స్పృహ తప్పి పడివున్న బాలికను తల్లిదండ్రులు చింతలపూడి ఆసుపత్రికి తీసుకువెళ్ళి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళగా డాక్టర్ పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో ఏఎస్సై వి.జయకుమార్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హోటళ్లపై జాయింట్ కలెక్టర్ దాడులు

37 గృహ సిలిండర్ల సీజ్

భీమవరం టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత జిల్లా జాయింట్ కలెక్టర్ సిబ్బందితో భీమవరం పట్టణంలోని పలు హోటల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని 11 హోటల్స్, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. వీటిలో ఎనిమిది హోటళ్లలో గృహ అవసరాలకు వినియోగించే 37 సబ్సిడీ సిలిండర్లను అక్రమంగా వాడుతున్నట్లు గుర్తించారు. అనంతరం జేసీ ఆదేశాలతో సిలిండర్లను సీజ్ చేసి 6-ఎ కేసులను నమోదు చేశారు. ఆకస్మిక తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ, ఏఎస్‌వో శివ శంకర్ పాల్గొన్నారు

ఏఎంసీ చెక్‌పోస్టులో విజిలెన్స్ తనిఖీ



జీలుగుమిల్లి ఏఎంసీ చెక్‌పోస్టులో విజిలెన్స్ తనిఖీల్లో డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, అధికారులు

జీలుగుమిల్లి, జనవరి 18: (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును ఏఎంసీ డిప్యూటీ డైరెక్టరు పి.లావణ్య (విజయవాడ) విజిలెన్స్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. వారానికి ఒకసారి నిర్వహించే విజిలెన్స్ తనిఖీ 24 గంటలపాటు ఉంటుందన్నారు. సరిహద్దు ప్రాంతంలో జీలుగుమిల్లి చెక్‌పోస్టుకు మార్చి నాటికి రెండున్నర కోట్లు టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు రూ.కోటి 76 లక్షలు సెస్ రూపంలో వసూలు చేశారని లావణ్య చెప్పారు. ప్రస్తుతం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ, సెస్ చెల్లించే విధానంలో హెచ్చు తగ్గులు రాకుండా చూడటం, వాహనదారులు దొంగ రశీదులు చూపకుండా సంబంధిత లోడు ఓనర్లతో ఫోన్ ద్వారా చర్చించటం, సిబ్బంది సెస్ వసూలు చేసే అన్ని వాహనాలు చెక్ పోస్టు వద్ద ఆపి సిబ్బంది సక్రమంగా తనిఖీ చేస్తున్నారా, వదిలేస్తున్నా వంటి అంశాలపై తనిఖీలు జరిపారు. విజిలెన్స్ అధికారులు, దెందులూరు, కలిదిండి, చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఏఎంసీ సెక్రటరీలు ఎంవిడి.శ్రీనివాస్, ఎం.వరలక్ష్మీ, ఎస్‌కె.పాషా, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్ఐ ఫాజిల్ రెహ్మాన్ శనివారం తెలిపారు. భీమవరం బలుసుమూడి బీసీ కాలనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో అక్కడకు వెళ్ళి దాడి చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి రూ. 38 వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఏలూరు జడ్పీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఘంటా పద్మశ్రీ, బడేటి చంటి


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద ఎంపీ పుట్టా మహేశ్ నివాళి


భీమడోలులోని 'గన్ని' క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న గన్ని, టీడీపీ నాయకులు


ప్రగడవరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్


విజయరాయిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


ఉంగుటూరు గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

వాడవాడలా వర్ధంతి కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. టీడీపీ కార్యాలయాలతో పాటు పలు సెంటర్లలోని విగ్రహాల వద్ద, చిత్రపటాలకు కూటమి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏలూరు సిటీ/ఏలూరు/ఏలూరురూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్ర మాన్ని శనివారం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఉన్న దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. టీడీపీ నేతలు మాజీ ఈడ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కలవకొల్లు సాంబ, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, ఆర్‌ఎన్ ఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఏలూరులోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా చిత్రపటం వద్ద ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ నివాళులర్పించారు. ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండలం మాజీ అధ్యక్షుడు నేతల రవి ఆధ్వ ర్యంలో నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ కొట్టే సుబ్బారావు, మాజీ సర్పంచ్ ఉకలాపు సత్యనా రాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చింతలపూడి/ఏలూరు/లింగపాలెం/కామవ రపుకోట : చింతలపూడి మండలం ప్రగడవ రంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పిం చారు. టీడీపీ నాయకులు టి.చంద్రశేఖరరెడ్డి, రాజారెడ్డి, కేటీఆర్ పాల్గొన్నారు. చింతలపూడి మేడబడి సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద, పోతునూరు, పొనుకుమాడు, యర్రగుం టపల్లి, మల్లాయిగూడెం గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. జంగారెడ్డిగూడెంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వ ర్యంలో కాకర్ల కాంప్లెక్స్ వద్ద, బైపాస్ రోడ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాలులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. టీడీపీ నాయకులు దాసరి శ్యామ్ చంద్రశేషు, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, మద్దిపాటి నాగేశ్వరరావు, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. లింగపా లెం మండలంలోని ఎన్టీఆర్ విగ్రహా లకు టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వ ర్యంలో నివాళులర్పించారు.

మోరంపూడి మల్లికార్జునరావు, గారపాటి బుజ్జయ్య, రాయంకుల చక్రధరరావు, మోరం పూడి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కామవరపుకోటలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, రైతు సంఘ నాయకులు కోనేరు వెంకట్రామయ్య, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు/పెదవేగి : దెందులూ రులోని ఎన్‌టీఆర్ సెంటర్‌లో తారక రామా రావు వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే చింతమ నేని ప్రభాకర్ నివాళులర్పించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు యిప్పిలి వెంకటేశ్వరావు, కొండయ్య చౌదరి మాగంటి నారాయణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహా నికి చింతమనేని ప్రభాకర్ నివాళులర్పించారు. విజయరాయి, లక్ష్మీపురం, పెదవేగిలో ఆయా గ్రా మాల నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు.

● భీమడోలు/ఉంగుటూరు/నిడమర్రు : భీమడోలులోని సంతమార్కెట్, పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహా లకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనే యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహిం చిన రక్తదాన శిబిరంలో 81 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఉంగుటూరు సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పొట్నూరి సింహా చలం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

● ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మం డలం మారంపల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు లంకా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు పోలిన శ్రీను, నాదెండ్ల సురేంద్రనాథ్ చౌదరి, రే గంటి రాంబాబు, మద్దిపాటి రత్నాజీ, పాకలపాటి గాంధి, ఏపూరి దాలయ్య, డి.వి. చౌదరి, ఇమ్మడి రత్నాజి తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం/కొయ్యలగూడెం/ఏలూరు/టి.నరసాపురం : బుట్టాయగూడెం మండలం కండ్రికగూడెంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు నివాళుల ర్పించారు. పాఠశాల పిల్ల లకు పాఠ్యపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కొమ్ముగూడెం, రెడ్డిగణపవరం గ్రామాల్లోను ఎన్టీ ఆర్ విగ్రహా లకు నాయకులు నివాళులర్పించారు. నాయకులు మొగపర్తి సోంబాబు, మడకం కన్న పరాజు, పూనెం బోడయ్య, దెయ్యాల కృష్ణమో హన్, గద్దె అబ్బులు పాల్గొన్నారు. కొయ్యల గూడెం మండలం దిప్పకాయలపాడులో రక్తదా న శిబిరం మానవత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు మాట్లాడారు. టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, మానవత సంస్థ సభ్యులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, మాదేపల్లి శ్రీనివాస్, చింతల వెంకటరమణ, బలుసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పోలవరం సచివాలయ ఆవరణలో, స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో వున్న ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ ఆధ్వ ర్యంలో పూలమాలలు వేసి నినాదాలు చేశారు. టి. నరసాపురం మండలం బొర్రంపాలెం ప్రాథ మిక ఆరోగ్యకేంద్రంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టి.నరసాపు రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ పూలమాలవేసి నివాళులర్పించారు.

● వేలేరుపాడు/కుక్కునూరు : వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు కొమ్మన వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, సుధాకర్, సంజీవులు పాల్గొన్నారు. కుక్కునూ రులో స్థానిక క్రాస్‌రోడ్డు నుంచి ర్యాలీగా బయ ల్దేరి రామాలయం వద్దకు టీడీపీ నాయకులు చేరుకుని ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


దెందులూరులో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన చింతమనేని ప్రభాకర్


మారంపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, టీడీపీ నేతలు


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న చైర్మన్ శ్రీనివాసులు


దిప్పకాయలపాడులో ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

పరీక్షా పే చర్చాగోష్టిలో పాల్గొన్న విద్యార్థికి అభినందనలు

ఏలూరు అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఢిల్లీలో ఈనెల 13న నిర్వహించిన పరీక్షా పే చర్చలో పాల్గొన్న తెలుగు రాష్ట్రాల విద్యార్థుల బృందంలో ఒకరైన నిడమర్రు జడ్పీ హైస్కూలు తొమ్మిదో తరగతి విద్యార్థి పి.వి.సువార్తరాజు, గైడ్ టీచర్ కె.కృష్ణప్ర సాద్‌లను అభినందించారు. శనివారం ఏలూరు లో డీఈవో వెంకటలక్ష్మమ్మ అభినందించి చర్చాగోష్టి వివరాలను డీఈవో అడిగి తెలుసు కున్నారు. విద్యార్థి, గైడ్ టీచర్‌లకు బహుమ తులుగా అందజేసిన యోగా మ్యాట్, టీషర్టు, విలువైన పుస్తకాలు, కప్‌లను డీఈవో అందజేశారు. సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, ఎంఈవో భాస్కర్‌కుమార్, స్కూలు హెచ్‌ఎం రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థి సువార్తరాజుకు బహుమతిని అందజేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

వినూత్నమైన మార్పులతో అభివృద్ధి చేస్తాం : మద్దిపాటి

ద్వారకాతిరుమల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వినూత్నమైన మార్పులు తెచ్చి అభివృద్ధి, సంక్షేమ పరంగా రూపురేఖలు మారుస్తామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపా టి వెంకట్రాజు అన్నారు. శనివారం ద్వారకా తిరుమల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బొండాడ మోహినీవెంకన్నబాబు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్యసమావేశానికి ముఖ్య అతిథిగా ఆయ న హాజరయ్యారు. పలు శాఖల పురోగతిపై మండల అధికారులతో ఆయన సమీక్షించి మాట్లాడారు. ఈ మండలం అభివృద్ధి పరంగా వెనుకబడినట్లు గుర్తించానని దీనికి అధికారుల సమన్వయలోపం స్పష్టమవుతోందన్నారు. రాను న్న రోజుల్లో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, ఎంపీడీవో పీవీవీ ప్రకాష్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ముంజునూరు వాటర్‌ఫాల్స్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా : చిర్రి

కొయ్యలగూడెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బుట్టాయిగూడెం మండలం ముంజులూరు వాటర్ ఫాల్స్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శనివారం ముంజులూరు వాటర్ ఫాల్స్ ప్రాం తాన్ని, అటవీ ప్రాంతాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ వున్న కొండలను పరిశీలించి మాట్లాడారు. ప్రమా దభరితంగా ఉన్నప్పటికి పర్యాటకులు ఎంతో కష్టాన్ని ఓర్చి వాటర్ ఫాల్స్ చూసేందుకు వస్తున్నారన్నారు. పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వాటర్‌ఫాల్స్ వద్ద కుమారుడు, కుమార్తె, భార్యతో కొన్ని గంటల పాటు సంతోషంగా గడిపారు.


ముంజూరు వాటర్‌ఫాల్స్ వద్ద కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే బాలరాజు

ఐదుగురు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల అందజేత

చింతలపూడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో చైర్మన్ కం జూనియర్ సివిల్ న్యాయాధికారి సి.హెచ్.మధుబాబు కోర్టు ప్రాంగణంలో శనివారం ఐదుగురు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా హె ల్మెట్ ఆవశ్యకతను తెలియచేస్తూ దీనివల్ల ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చని సూ చించారు. చింతలపూడి పోలీస్ సిబ్బందికి కూడా అందజేశారు. అనం తరం సబ్ జైల్‌ను తనిఖీ చేశారు. అక్కడ నిందితులకు అందు తున్న ఆహార వైద్య సేవలపై ఆరా తీశారు. ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. వంటశాల స్టోరూమ్‌ను తనిఖీ చేసి ఖైదీలకు సూచనలు ఇచ్చారు. ఉపకారాగార పర్యవేక్షణ అధికారి కృపానందం, జైలు సిబ్బంది, న్యాయవాదులు కె.అప్పయ్య, పి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం డ్రైవర్‌పై కేసు

ఏలూరు క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఆసుపత్రికి వచ్చి అధికారు లు, వైద్యులను దూషిస్తుండగా అడ్డు వెళ్ళిన మహిళా సెక్యూరిటీ గార్డుపై అసభ్యంగా ప్రవర్తించి, దుర్భాషలు ఆడడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు ప్రభుత్వాసు పత్రిలోని మృత దేహాలను తరలించే మహాప్ర స్థానం వాహనానికి కృష్ణారెడ్డి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15న పూటుగా మ ద్యంతాగి ఆసుపత్రికి వచ్చాడు. అత్యవసర విభాగంలో ఆసుపత్రి అధికారి పరిశీలన ఉండగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ ఉన్న మహిళా సెక్యూరిటీ గార్డు అడ్డు కున్నారు. ఆమెను తోసివేసి లోపలికి వెళ్ళి ఆసుపత్రి అధికారులను, వైద్యులను దుర్భాష లాడాడు. ఈ మేరకు ఆమె ఫిర్యాదు మేరకు కృష్ణారెడ్డిపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న ఏలూరులో జాబ్‌మేళా

ఏలూరుకార్పొరేషన్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 9.30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయ ఆవర ణలో యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూ షణరావు తెలిపారు. తిరుపతి జిల్లాలో శ్రీసిటీ లో గల చాక్లెట్స్ కంపెనీలో పనిచేసేందుకు టీమ్ మెంబర్లుగా, ట్రైనీగా పనిచేసేందుకు ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ తదిత ర కోర్సులు చేసిన వారికి మొదటి ప్రయ త్నంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి 18-22 సంవత్సరాలు వయస్సు గల వారు అర్హులన్నారు. శ్రీ సిటీకి సంబంధించిన వివిధ ఇండస్ట్రీ ప్రతినిధులు పాల్గొంటా రన్నారు. మరిన్ని వివరాలకు 88868 82032 నబరులో సంప్రదించాలన్నారు.

స్వచ్ఛత అనేది సమాజానికి ఇచ్చే బహుమతి

» జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం/ఏలూరు రూరల్/ఏలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛత అనేది మన బాధ్యత మాత్రమే కాదని అది సమా జా నికి ఇచ్చే బహుమతి అని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో శనివారం నిర్వహిం చారు. ప్రతి మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందికి ఆయన సూచించారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని జేసి ధాత్రిరెడ్డి ప్రారంభించి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో నాంచా రయ్య, పరిపాలన విభాగంలోని సూపరిం టెండెంట్లు, కలెక్టరేట్ సిబ్బందితో సామూహి కంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ల వద్ద ప్రభుత్వ పిలుపు మేరకు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ను సిబ్బందితో కలిసి విజయవంతంగా నిర్వహించామని జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవుల య్య తెలిపారు. రూరల్ మండలం మల్కాపు రంలో ఎంపీడీవో వెన్న శ్రీలత ఆధ్వర్యంలో పరిశుభ్రతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

● చింతలపూడి/లింగపాలెం/కామవరపుకోట : చింతలపూడి పాతబస్టాండ్ సమీపంలోని మినీ బస్టాండ్ వద్ద మునిసిపల్ కమిషనర్ డి.పావని ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొని రోడ్లపై చెత్తను ఊడ్చారు. అక్కడే గోడ కు రంగు వేశారు. లింగపాలెం మండలంలో తహసీల్దార్ నజీముల్లాషా ఆధ్వర్యంలో, కామ వరపుకోట మండలంలో అధికార, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని జరిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరా మకృష్ణ, తహసీల్దార్ గెద్దం ఎలీషా, ఎంపీడీవో సరళకుమారి, సర్పం చ్‌లు వేముల నాగేశ్వరరావు, పసుమర్తి పార్థసారథి బాబు, గోరింక దాసు పాల్గొన్నారు.

●కొయ్యలగూడెం/బుట్టాయగూడెం/ఏలూరు : కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామంలో మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, సర్పంచ్ తాడేపల్లి గోపి ఆధ్వర్యంలో, కన్నాపురంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పం చ్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛత దివస్ నిర్వహించారు. బుట్టాయగూడెంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీలో పాల్గొన్నారు. జనసేన జిల్లా కరాటం సాయిబాబా, ఎంపీడీవో కె.జ్యోతి, తహ సీల్దార్ పీవీ చలపతిరావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ పాల్గొన్నారు. పోలవరం మండలం జిల్లెల్లగూడెం పంచాయతీలలో స్వచ్ఛత శుభ్ర తపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు.

● దెందులూరు : దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దార్ సుమతి, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

● ఉంగుటూరు : ఉంగుటూరు మండలం బాదంపూడిలో పీహెచ్‌సీ సబ్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో అక్కడి పరిసరాలను శుభ్రపరచి చెత్తను ఎత్తారు. అనంతరం ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త సేకరణ కోసం ప్రజలకు ప్లాస్టిక్ టబ్‌లు పంపిణీ చేశారు. ఎంపీడీవో రాజ్‌మనోజ్, ఈవోపీ ఆర్‌డీ చంద్రశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల/నిడమర్రు: ద్వారకాతిరు మలకు వేలాదిగా వచ్చే భక్తుల దృష్ట్యా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యపరిరక్షణకు పాటుబడాలని ఎంపీడీ వో పీవీవీ ప్రకాష్ కోరారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్‌లో భాగంగా ద్వారకాతిరుమల మండల పరిషత్ పరిసరాలను అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. ఈవోపీఆర్‌డీ ఏవీ సుబ్బరాయన్, కార్యదర్శి జీటీ శ్రీనివాస్, మహిళా పోలీస్ పి.లక్ష్మీసుజన, తదితరులు పాల్గొన్నారు. నిడమర్రు గ్రామ పరిసరాలలో మెయిన్‌రోడ్డు ఆనుకొని శ్మశానవాటిక వద్ద గల చెత్తాచెదారాన్ని ఎంపీడీవో విజయకుమారి ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు. అనంతరం మానవ హారం నిర్వ హించి పరిశుభ్రత ప్రాధన్యతను తెలియజేశారు.




మల్కాపురంలో పంచాయతీ సిబ్బంది ర్యాలీ.. ఏలూరులో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో మహిళా పోలీసులు

చిరుధాన్యాల ఉత్పత్తుల ప్రోత్సాహానికి కలెక్టర్ హామీ

మహిళా మండలి అధ్యక్షురాలు కృపామణి

కొయ్యలగూడెం, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): చిరుధాన్యాల ఉత్పత్తులకు ప్రోత్సా హం అందిస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి హామీ ఇచ్చారని మదర్‌థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలు తోట కృపామణి తెలిపారు. శనివారం ఏలూరులో తాను తయారు చేసిన చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులను పరిశీలించి తనను కలెక్టర్ సన్మానించారని తెలిపారు. ఈ సందర్భంగా యూనిట్ స్థాపించడానికి ఎదు రైన సమస్యలను కలెక్టర్‌కు తెలిపామన్నారు. తనను ప్రోత్సహించినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

కుక్కునూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కుక్కునూరు తెలుగుదేశం పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. శనివారం ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో విభే దాలు బయటపడ్డాయి. కివ్వాక ఎంపీటీసీ ముప్పాల శ్రీదేవిని, తెలుగు మహిళా అధ్యక్షు రాలు వనమా భాగ్యలక్ష్మిని, కుక్కునూరు టౌన్ ప్రెసిడెంట్ కె.మురళీమోహన్ కార్యక్ర మానికి వెళ్ళినప్పటికి ప్రొటోకాల్ పాటిం చకుండా కనీసం కొబ్బరికాయ కొట్టడానికి కూడా వారిని పిలవలేదని టీడీపీ నాయ కులు ముప్పాల సాంబశివరావు ఆరోపిం చారు. ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. మాకు న్యాయం జరగకపోతే పదవులకు రాజీనామా చేస్తామని టీడీపీ నాయకులు ముప్పాల సాంబశివరావు, కె.మురళీమోహన్ తెలిపారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

ఉంగుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అడ్డుకుని బాలికల జీవి తాన్ని మంచి భవిష్యత్తులోకి తీసుకు వెళ్లాల ని చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కో- ఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని బాదంపూడి గ్రా మంలో బాల్య వివాహాల నిరోధంపై అవగా హన కల్పించి, గ్రామంలో ర్యాలీ నిర్వహిం చారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ మనందరి బాధ్యత : జడ్జి

ఏలూరు క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, ఈవిధమైన పరీక్షలు నియంత్రిం చాల్సిన బాధ్యత అధికారులపై, మనందరిపై ఉందని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఏలూరు జిల్లా కోర్టు ఆవర ణలో ఉన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో శనివారం ఏలూరులో లింగనిర్ధారణ కేంద్రాలు, వారి సిబ్బందికి ముందస్తు లింగ నిర్ధారణ చేయడం వల్ల కలిగే అనర్థాలపై అవ గాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఈ పరిస్థితుల్లో కూడా కొన్ని పరీక్షా కేంద్రాల్లో స్వలాభం కోసం ఇటువంటి పరీక్షలు చేస్తున్నా రని వీటిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులతో పాటు సమాజంపై కూడా ఉంద ని తెలిపారు. ఈ చట్టాన్ని ఎవరైనా అతిక్రమిం చిన జరిమానాలతో పాటు, శిక్షార్హులని సూచిం చారు. డిప్యూటీ డెమో డినాగరత్నం, స్టేట్ వినియోగదారుల ఫోరం సభ్యురాలు కె. నాగలక్ష్మి, ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం కావాలి

పెదవేగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యావ్యవస్థను పటిష్టపర్చి సంపూర్ణ అక్షరాస్య తను సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పెదవేగి మండల విద్యాశాఖా ధికారి - 2 వి.అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి విద్యా వనరుల కేంద్రంలో విద్యావ్యవస్థ పటిష్ట తపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెదవేగి మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించి, తహసీల్దారు. ఎంపీడీవో, సీడీపీవో, ఎంఈవోల ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సభ్యులుగా ఆయా క్లస్టర్ల పరి ధిలో అక్షరాస్యతాభివృద్ధికి చర్యలు కృషి చేస్తా మని చెప్పారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ తమవంతు భాగస్వామ్యాన్ని అందించి, సంపూ ర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలని పిలుపునిచ్చా రు. తహసీల్దారు ఎస్డీ.భ్రమరాంబ, ఎంపీడీవో పి.శ్రీనివాస్, సీడీపీవో కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ముగిసిన శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక రామచంద్రరావుపేటలోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గత నెల 28న ప్రారం భమైన శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భగవద్గీత పారాయణ మండలి సభ్యులు సామూహికంగా భగవద్గీతను పఠించారు. కళావేదికపై జరిగిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేయగా, ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజా చార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు, కిళాంబి పవన్‌కుమారాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. విద్యుత్ వెలుగులతో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగడం పట్ల పండుగ వాతావరణం నెలకొంది.


విద్యుత్ వెలుగుల్లో శ్రీవారి ఆలయం

అచ్చమ్మ పేరంటాళ్ల జాతరకు జడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం

ఏలూరుసిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దెందులూరు నియోజకవర్గంలోని గాలాయి గూడెంలో ఫిబ్రవరి 4 నుంచి నిర్వహిస్తున్న అచ్చమ్మ పేరంటాళ్ళ జాతరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ను ఆలయ కమిటీ శనివారం ఆహ్వానించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు సిబ్బందికి యూనిఫాం పంపిణీ

ఏలూరు క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఉన్న పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకులో పనిచేసే సిబ్బందికి ఒక నెల వేతనం బోనస్‌గాను వారికి యూనిఫాంను ఎస్పీ కేపీఎస్ కిశోర్ అందించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి వీటిని శనివారం అందించారు. ఈ సంద ర్భంగా పెట్రోల్ బంకు ఉద్యోగులు ఆనంద పడ్డారు. ఎస్పీ చేతుల మీదుగా స్వయంగా యూనిఫామ్ అందుకోవడం ఆనందంగా ఉం దని వెల్లడించారు. ఎఆర్‌ఆర్‌ఐ పవన్‌కుమార్, ఎఆర్‌ఎస్‌ఐ రవీంద్ర పాల్గొన్నారు.

టుబాకో నేత రమణరావు మృతికి సంతాపం

ఏలూరుకార్పొరేషన్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి) : ఏలూరుటౌన్ టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు తీరిండి రమణ రావు మృతికి ఏఐటీయూసీ, ఏలూరు పట్టణ పొగాకు పనివార్ల సంఘం నాయకులు శనివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన పార్థీవదేహానికి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, నాయ కులు కడుపు కన్నయ్య, ఎస్. సంజీవరావు తదితరులు నివాళులర్పించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మండవల్లి జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. హైస్కూల్‌లో 145మంది విద్యార్థులకు గాను 70మంది మాత్రమే హాజరయ్యారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్ తెలిపారు.

విశాఖ ఉక్కుకు ప్యాకేజీపై హర్షం

ముదినేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు రక్షణకు, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థిక ప్యాకేజీ ప్రకటించటం హర్షణీయమని భారతీయ జనతా పార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ అడుసుమిల్లి సాయికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, మూత లాంటి అంశాలపై ప్రజల్లో అపోహలు ఏర్పడిన సమయంలో ఈ కర్మాగారాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం ప్రధాని నరేంద్రమోదీకి ఆంధ్రపై ఉన్న అభిమానాన్ని చాటి చెబుతున్నదని ఆయన పేర్కొన్నారు.

రేపటి నుంచి అవుటపల్లిలో ఉచిత దంత వైద్య శిబిరం

ముదినేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి 31 వరకు కృష్ణా జిల్లా చిన అవుటపల్లిలోని డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్యశాలలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.రామోజీరావు, హెచ్‌వోడీ డాక్టర్ టి.సునీల్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో తీసి పెట్టుకునే పూర్తి పళ్ల సెట్లు పాక్షిత పళ్ల సెట్లు ఉచితంగా అమర్చుతామని తెలిపారు.



హలో.. చ(సె)ల్!

ఎడా పెడా సెల్‌ఫోన్ల వినియోగం

ఇంట్లో ప్రతి సభ్యుడికీ స్మార్ట్‌ఫోన్.. సిమ్‌లు రెండు..!

నిత్యావసరాల జాబితాలో సెల్‌ఫోన్

అతిగా వాడితే ఆరోగ్యంపై ప్రభావం ..

ఏటా లక్షల ఫోన్ల వినియోగం

సెల్‌ఫోన్ లేని మనిషి లేడంటే అతిశయోక్తి కాదు.. అవును ఇప్పుడు పేరుతోపాటు మనిషికో నెంబర్.. నలుగురు సభ్యులున్న ఒక కుటుంబంలో కనిష్టంగా నాలుగు నుంచి ఆరు వరకు ఫోన్‌లు ఉంటున్నాయి. కొన్ని కుటుంబా ల్లో ఇంటాయనకు కచ్చితంగా రెండు ఫోన్‌లు, నాలుగు సిమ్‌లు ఉండాల్సిందే ! ఇంటావిడికి పర్సనల్‌గా ఒక ఫోన్ అదనంగా రెండు సిమ్‌లు, చిన్నపిల్లలు ఉంటే ఫోన్‌లో గేమ్‌లు చూసుకోవడా నికి, కార్టూన్ నెట్‌వర్క్‌లకు మరో స్మార్ట్ ఫోన్.. కళాశాలలకు వెళ్లే పిల్లలు ఉంటే హైరిజల్యుషన్ ఫోన్ ఒకటి ఉండాల్సిందే. సెల్‌ఫోన్‌ల వినియోగం ఇంతలా ఉంటే కుటుంబానికి ఆర్థిక భారంతోపాటు అనారోగ్యం కూడా.. జర జాగ్రత్త..

- పాలకొల్లు(ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సెల్‌ఫోన్‌ల వినియోగం పెరిగి మంచి ఫలితాలు ఇస్తుం డగా మరొక కోణంలో యువతను పెడ దోవ పెట్టుస్తున్నది. వాట్సప్, ఇన్‌స్టా గ్రాం, ఫేస్‌బుక్, షార్ట్ వీడియోస్, రీల్స్ ఇలా అనేక విభాగాల వినియో గంతో యువత చదువుకు దూరం అవుతున్నారు. సెల్‌ఫోన్‌లు వినియో గిస్తున్న యువతతో సహా వయోజ నులలో ఎక్కువ శాతం మంది అశ్లీలతను వీక్షిస్తున్నట్లు వివిధ సర్వేలలో వెల్లడైంది. సెల్‌ఫోన్ వల్ల ఎంత ఉపయోగం ఉందో ఆ మేరకు నష్టమూ ఉంది. ఇందుకోసం ప్రభుత్వాలు కొన్ని చట్టాలు చేయాల్సి ఉన్నదని నిపుణులు అంటున్నారు.

ఫోన్‌ల భారం నెలకు రూ.వెయ్యి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మధ్య తరగతి కుటుంబాలు, చిన్న కుటుంబాలు అనే భేదం లేకుండా ఒక్కొక్క కుటుంబానికి సెల్‌ఫోన్‌ల రీచార్జిల నిమి త్తం నెలకు కనిష్టంగా రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. వివిధ నెట్‌వర్క్‌లు ఉచి తాల ముసుగులో ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌ను నీరుగార్చి ఇప్పుడు ప్రైవేటు సెల్ ఆపరేటర్లు ధరలు పెంచేయడంతో వినియోగదారులకు మరింత భారం పెరిగింది. ఒక పూట కాఫీ లేకున్నా, భోజనం లేకుండా బతికేయవచ్చుగానీ సెల్‌ఫోన్ చెంతన లేదంటే ప్రతి వ్యక్తికి అది ఒక చింతగా మారింది. ఇప్పుడు సెల్‌ఫోన్ వినియోగించే వారిలో సుమారు 20 శాతం మంది ప్రతి ఐదు నిమిషాలకు సెల్‌ను కెలుకుతూనే ఉంటున్నారు. ఇది మానసిక శారీరక ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యంపై ప్రభావం

ఇటీవల సెల్‌ఫోన్‌ల వాడకం విస్తృతంగా పెరగడంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి. బాల్యం, కౌమారం, యవ్వనం, వృద్ధాప్యం అనే దశలు ఉన్నట్టుగానే సెల్‌ఫోన్‌లు వినియోగంలోనూ అనేక ప్రమాదకర తరంగాలు ఉన్నాయి. వీటిని రేడియో తరంగాలు గానూ, సూక్ష్మ తరంగాలు గానూ, పర్యావరణ తరంగాలు, కాంతి తరంగాలు, అతినీల లోహిత తరంగాలు ఇలా ఏ పేర్లతో పిలిచినా తరంగాలు పొడవును బట్టి ఫ్రీక్వెన్సీ మారి అనారోగ్యాన్ని తెచ్చి పెడతాయి. సెల్‌ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని మాట్లాడటం కంటే బల్లపై ఉంచి ఒక తీగను (బ్లూ టూత్) ద్వారా వినడానికి ప్రయత్నించాలి. తలకు సెల్‌ఫోన్‌కి దూరం పెంచాలి. శరీరానికి సెల్‌కు దూరంగా ఉంచాలి. సెల్‌ఫోన్ అందుబాటులో ఉంది కదా అని 24 గంటలూ మాట్లాడటం అతి ప్రమాదం. జాగ్రత్తలు తీసుకుంటే సెల్‌ఫోన్‌ల వల్ల నష్టాలు తగ్గుతాయి.

రూ.20 వేలకు ఫ్యాన్సీ నెంబరు

'నా వద్ద ఇప్పటికే మూడు సిమ్‌లు ఉన్నాయి. ఫ్యాన్సీ నెంబరు బాగుండడంతో రూ.20 వేలు చెల్లించి మరో సిమ్ కొన్నా. నా రెండు ఫోన్‌లలో నాలుగు నెట్‌వర్క్‌ల సిమ్‌లు వేశా. ఒక్కొక్క సందర్భంలో ఒక్కో నెట్‌వర్క్ వాడుతుంటా. వ్యాపార రీత్యా బయటకు వెళ్లినప్పుడు కొన్ని ప్రాంతాల్లో కొన్ని నెట్‌వర్క్‌లకు సిగ్నల్ ఉండదు. అప్పుడు ఈ సిమ్‌ల ద్వారా అదనపు నెట్‌వర్క్‌లో వాడుకుంటా. నెలకు రూ.1500 వరకు అవుతుంది' అని లోక్‌నాథ్ చెప్పారు.

అప్పుల బాధ భరించలేక సిమ్ మార్చేశా

పాలకొల్లు మండలానికి చెందిన విఘ్నేష్ (పేరు మార్చడమైనది) రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈ వ్యాపా రం మందగించడంతో రుణాలు పెరిగిపోయాయని రుణగ్రహీతల నుంచి ఒత్తిడి తట్టుకోలేక తరచూ సిమ్‌లు మార్చాల్సి వస్తోందని అతను చెబుతున్నాడు. విపత్కర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గం లేకే ఈ విధంగా చేస్తున్నా. అయినప్పటికీ పర్సనల్ నెంబరు ముఖ్యులకు తప్ప ఎవరికీ ఇవ్వను. తరచూ మార్చే నెంబర్లు మాత్రమే ఇస్తానంటున్నాడు.

మొబైల్ ఫోన్ అనే ఇంగ్లీష్ పదాన్ని మనం తెలుగులో దూరవాణి లేక చరవాణి అని పిలుస్తాం. మన దేశంలో సెల్‌ఫోన్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావటానికి సమయం పట్టినప్పటికీ జపాన్‌లో 1979లోనే మొబైల్ ఫోన్ వినియోగంలోకి వచ్చింది. 1983లో అమెరికాలో మొబైల్ ఫోన్ ప్రాచుర్యంలోకి వచ్చింది. అప్పుడు దీని బరువు 2.2పౌండ్లు (ఒక కిలో ఉండేది). ఇప్పుడు సెల్‌ఫోన్ బరువు గ్రాముల్లోకి మారింది. సెల్‌ఫోన్ రంగంలో మరింత ఆధునికత పెరిగి ఫిన్‌లాండ్ దేశంలో 1991లో 2వ తరం (2జీ ఫోన్‌లు వచ్చాయి) 2001లో 3జీ ఫోన్‌లు, ఆ తర్వాత 4జీ ఇప్పుడు 5జీ వైపు అడుగులు వెయ్యగా రానున్న రోజుల్లో మరింత సాంకేతికత పెరిగే అవకాశాలు ఉన్నాయి.



కోటపాడులో, కైకలూరులో, కలిదిండిలో ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

కైకలూరు/చాట్రాయి/కలిదిండి/ముసునూరు/ముదినేపల్లి/మండవల్లి/నూజివీడు/నూజివీడు టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ ఎన్టీ రామారావు అని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు కొనియాడారు. శనివారం స్వర్గీయ ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా కైకలూరులోని తాలుకా సెంటర్, కోరుకొల్లురోడ్డు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజెఎస్ మాల్యాద్రి సహకారంతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, నియోజకవర్గ టీడీపీ కోకన్వీనర్ తేరా రమేష్ బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, పట్టణపార్టీ అధ్యక్షుడు ఎండీ జాని, ఈసీ చైర్మన్ పొత్తూరి వాసు రాజు పాల్గొన్నారు. చాట్రాయి మండలంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల నాయకులు మరిడి చిట్టిబాబు, బొట్టు లక్ష్మణరావు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ల డైరెక్టర్లు అంద్రాజు శ్రీనివాస్ లంకా రత్నారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కురేళ్ల ఏడుకొండలు, బీసీ సెల్ కార్యదర్శి గూడవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కూటమి నాయకులు వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. డీసీ వైస్ చైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బళ్ల రాజు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అంద్రాజు దుర్గారావు పాల్గొన్నారు. ముసునూరు మండలంలో సర్పంచ్‌లు తల్లిబోయిన రాధిక, ఎంపీటీసీ సభ్యులు కాటేపల్లి పుష్పావతి, మాజీ జడ్పీటీసీ సీహెచ్.వెంకటేశ్వరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, మాజీ ఉపసర్పంచ్ కె.సత్యనారాయణ తదితరులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. లోపూడిలో గ్రామ టీడీపీ అధ్యక్షులు వేంపాటి శ్రీనివాసరావు, డీసీ వైస్ చైర్మన్ చలమాల వెంకటేశ్వరరావు, గోపవరం ఏస్సీకాలనీలో గ్రామపార్టీ అధ్యక్షులు బొల్లినేని బుజ్జియ్య, యువనేత ఉప్పలపాటి గణేష్ తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు తుమ్మా వీరాంజనేయులు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి కందేపి పద్మ పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, తెలుగు రైతు నాయకులు చలసాని జగన్మోహనరావు, బొప్పన సుందర రామయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్ పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేశారు. మండవల్లి, భైరవపట్నంలో కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, బొల్లంపల్లి కృష్ణారావు, నాగనబోయిన పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నూజివీడు మండలం తుక్కులూరులోని జేబీఎల్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలను మంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూజివీడులోని తన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నూజివీడు మండలం రావిచర్లలోని ఎన్టీఆర్ విగ్రహానికి నూజివీడు మాజీ ఏఎంసీ చైర్మన్, కాపా శ్రీనివాసరావు గ్రామస్థులతో కలిసి నివాళులర్పించారు.



లోపూడిలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు.. చిగురుకోటలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ .. భైరవపట్నంలో ఎన్డీయే నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ నివాళులు

వీఆర్వో విధులకు ఆటంకం : కేసు నమోదు

కలిదిండి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్వో విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. దుంపల కోడు దిబ్బలో పొనమండ తాతయ్య, త్రిమోతిలు ప్రభుత్వ భూమిలో అక్రమ చెరువు తవ్వుతుండగా, వీఆర్వో గుడిపాటి శ్రీనివాసరావు అడ్డుకుంటుండగా, విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో పార్కింగ్‌పై వివాదం

యువకుడికి తీవ్ర గాయాలు .. కేసు నమోదు

ముదినేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆటో పార్కింగ్ విషయమై ఇద్దరు వ్యక్తుల మధ్య కొట్లాటకు దారి తీసిన సంఘటన పేరూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామానికి చెందిన బొర్రా మనోగాంధీ తన కారును తన ఇంటి బయట నిత్యం రాత్రిళ్లు నిలిపి ఉంచుతాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి ఆ ప్రదేశంలో అదే గ్రామానికి చెందిన వడ్డీలు అనే వ్యక్తి తన ఆటోను నిలిపి ఉంచగా, ఆటోను తీసేయమని గాంధీ అడిగిన సందర్భంలో ఇరువురి మధ్య వివాదం తలెత్తి గొడవకు దారి తీసింది. ఈ గొడవలో వడ్డీలు మరో ఇద్దరు వ్యక్తులు కలసి కర్రలతో గాంధీని కొట్టారు. గాంధీని గుడివాడ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.



స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి సారథి



పెదపాలపర్రు స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్, అధికారులు



కలిదిండిలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, కూటమి నాయకులు

స్వచ్ఛత- శుభ్రత ప్రజల జీవనవిధానం కావాలి

» మంత్రి పార్థసారథి » అంతటా స్వచ్ఛతా ర్యాలీలు

నూజివీడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం నూజివీడు మండలం తుక్కులూరులో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుక్కులూరు కూడలిలో మానవహారంగా ఏర్పడి, అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ తొమ్మండ్రు బుజ్జి, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, డీఎల్‌పీవో ఎంపీఎల్ సుందరి, డీఎల్‌డీవో వెంకట్రావు పాల్గొన్నారు.

చెత్త తొలగించిన మంత్రి

స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని మంత్రి సారథి నూజివీడు రాజీవ్‌సర్కిల్ వద్ద లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా పారిశుధ్యం మెరుగుదలకు పూనుకుని చెత్తను స్వయంగా తొలగించారు. దీనిలో మున్సిపల్ కార్మికులు, మెప్మా సిబ్బంది, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయి/కలిదిండి/ముసునూరు/ముదినేపల్లి/మండవల్లి/ఆగిరిపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన వైపు అందరూ అడుగులు వేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ గీత కోరారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం చాట్రాయిలో ర్యాలీ, మానవ హారం, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగరాజు, ఏపీఎం వెంకటేశ్వరరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్ గాయత్రి పాల్గొన్నారు. కలిదిండిలో శనివారం అధికారులు, కూటమి నాయకులు స్వచ్ఛతా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ రామకృష్ణ, సర్పంచ్ మారుతి ప్రసన్న పాల్గొన్నారు. ముసునూరు మండలంలో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, ఎంపీడీవో జి.రాణి పాల్గొన్నారు. ముసునూరు వెలుగు కార్యాలయ ప్రాంగణాల్లో చెత్త చెదారాన్ని తొలిగించి, రంగవల్లుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండా విజయలక్ష్మి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారాయణ, ఏపీఎం కె.రాంబాబు, ఏపీవో రోజ్‌లీల పాల్గొన్నారు. ముదినేపల్లిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వై.రామకృష్ణ, తహసీల్దార్ సుభానీ, ఎంఈవో కె.నరేష్ కుమార్, ఏవో వేణుమాధవ్ తదితరుల ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసిన అనంతరం చీపుర్లు పట్టి రోడ్లు శుభ్రం చేశారు. పెదపాలపర్రు గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీని కూటమి నాయకులు నిర్వహించారు. మండవల్లిలో అధికారులు, నాయకులు ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కన చెత్తను శుభ్రం చేశారు. కూటమి నాయకులు సత్తిబాబు, ఎండీవో రామలింగేశ్వరరావు, సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కైకలూరులో స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీవో ఆర్ ఫణీంద్ర మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటపాకలో కైకలూరు పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు, ఎమ్మార్వో పీఎన్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.



నూజివీడులో పారిశుధ్య పరిస్థితిని పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ సెల్వి

పారిశుధ్య మెరుగుదలకు ప్రజలు సహకరించాలి : కలెక్టర్

నూజివీడు టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య మెరుగుదలలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా నూజివీడు పట్టణంలో పారిశుధ్య మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలను ఆమె నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూజివీడు మున్సిపల్‌పరిధిలో ఎక్కడపడితే అక్కడ చెత్తవేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కేంద్రీయ విద్యాలయ తాత్కాలిక భవనాల పరిశీలన

నూజివీడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిపాదిత కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నిర్దేశించిన తాత్కాలిక భవనాలను మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మహ్మద్‌ఆసీఫ్ శనివారం నూజివీడులో పరిశీలించారు. ఏలూరుజిల్లా నూజివీడు కేంద్రంగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఉద్దేశించి ఎంప్లాయిస్ కాలనీలోని తాత్కాలిక భవనాలను, గత ప్రభుత్వం నూజివీడు ట్రిపుల్‌ఐటీ సమీపంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేటాయించిన ఏడు ఎకరాల భూమిని మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో నూజివీడు తహసీల్దార్ సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నూజివీడు కేంద్రీయ విద్యాలయ తాత్కాలిక భవనాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని వినతి

ముసునూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ముసునూరు శివారు సంధ్యవాగు వద్ద ఇచ్చిన ఇళ్ళస్థలాల సమస్యను పరిష్కరించాలని మంత్రి కొలుసు పార్థసారథికి మాజీ సర్పంచ్, రైతు రేగుల గోపాలకృష్ణ శనివారం వినతిపత్రం అందజేశారు. నూజివీడు వచ్చిన మంత్రిని కలిసిన గోపాలకృష్ణ ఇళ్ళస్థలాల సమస్యలను వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో 7.08ఎకరాల భూమిని ఇచ్చామని, దీని నిమిత్తం ప్రభుత్వం రూ.కోటి30లక్షలు చెల్లించిందని రైతు మంత్రికి వివరించారు. ఈ ఇళ్ళస్థలాల లేఅవుట్లు గ్రామానికి నాలుగుకిలోమీటర్ల దూరంలో ఉందని, అక్కడకు వెళ్ళేందుకు లబ్ధిదారులు నిరాకరిస్తున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వానికి తిరిగి నగదును కట్టి భూమిని తీసుకోవాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. దీనిపై తక్షణమే ఉన్నతాధికారులతో మాట్లాడి, సమస్యను పరిష్కరించేలా చూస్తామని మంత్రి చెప్పినట్లు రైతు తెలిపారు.



మంత్రికి వినతపత్రమిస్తున్న రైతు గోపాలకృష్ణ